# శాంతి

# SANTI

విశ్వమానవ సాభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

అక్టోబరు / October - 2021



ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయో భవేత్

ఏకం సత్ విప్రా బహుధా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

– ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI

**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

**సంపుటి / Vol. 97** | **అక్టోబరు/October - 2021** | **సంచిక/No.10**

| వ.నెం. | విషయ సూచిక | పేజి నెం. |
|---|---|---|
| 1. | ప్రార్థన – ఆదిశంకరాచార్యకృత సౌందర్య లహరి | 2 |
| 2. | ధ్యానము – వివేక చూడామణి | 2 |
| 3. | ఓంకార్ ఆత్మకథ – అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | గాంధీ మహాత్ముని జయంతి సందేశము – జ్ఞానేశ్వరి మాతాజీ | 6 |
| 5. | శివుడు – శివపూజ – శ్రీ శివానంద స్వామి | 8 |
| 6. | రామ–రామి–స్వామి ఓంకార్ | 10 |
| 7. | అద్భుతమైన పరివర్తన – స్వామి రామదాసు | 13 |
| 8. | హ్రీం – వాగ్దేవి శారద | 15 |
| 9. | జగజ్జనని – స్వామి చిదానంద | 18 |
| 10. | శాంతి నివాసం – ఎమ్.ఎస్. రంగారావు | 20 |
| 11. | శ్రీతులసీ సర్వస్వము – జి.వి.యస్. సుబ్రహ్మణ్యశర్మ | 21 |
| 12. | విజ్ఞప్తి – గో సంతతికై గోశాల విస్తరణ | 23 |
| 13. | దాతలకు విజ్ఞప్తి | 24 |
| 14. | కార్యక్రమములు, విరాళములు | 25–28 |

⋆ **ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులు కాని. సంపాదకులు కారు.**

**జీవిత సభ్యత్వం రూ. 1000/–లు సాలుసరి రూ.100/–**

# ప్రార్థన

ఆదిశంకరాచార్య సౌందర్య లహరి

## మనస్సును స్వాధీన పరచుటకు ప్రార్థన ముఖ్యము

**క్వణత్కాంచీదామా కరికలభకుంభ స్తనవతా**
**పరిక్షీదా మధ్యే పరిణత శరచ్చంద్రవదనా**
**దనుర్బాణాన్ పాశం సృణ మపి దధానా**
**పురస్తాదాస్తాం నః పురమధితు కరతలైః రాహోపురుషికా**

మొరయుచున్న మువ్వల మొలనూలు కలదియు, ఏనుగుగున్న కుంభస్థలము వంటి కుచములచే వంగినదియు, నడుమున కృశించినదియు శరత్కాల మందలి నిండు చంద్రుని వంటి ముఖము కలదియు, చేతులతో విల్లమ్ములను పాశమును అంకుశమును ధరించుచున్నదియునగు పురారి అహంకార రూపురాలగు దేవి మాయెదుట నిల్చుగాక!

# ధ్యానము

## ధ్యానాభ్యాసము ద్వారా మనోవృత్తులు శాంతిస్తాయి

**ఏకమేవ సదనేక కారణం**
**కారణాంతర నిరాస కారణమ్**
**కార్యకారణ విలక్షణం స్వయం**
**బ్రహ్మతత్త్వమసి భావయాత్మని** **(వివేక చూడామణి శ్లోకం 260)**

ఉన్న ఏకైక సత్యం ఇదే అయినప్పటికీ అనేకత్వానికి ఇదే కారణం: అన్ని కారణాలను మిధ్యగా నిరూపించే దీనికి ఏ కారణమూ లేదు. కార్యకారణ సంబంధానికి అతీతమయినది. స్వతంత్రమయినది అయిన "బ్రహ్మమే నీవు". దీనిని నీ హృదయంలో ధ్యానించు.

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామీజీ ఆత్మకథ

అనువాదం : శ్రీమతి బొప్పన అరుణాదేవి

**అధ్యాయం - 31**

**ఒంటినిండా కట్లతో క్రిస్టమస్ పండగ సంబరాలు**

## విశ్వమంతా ప్రేమమయం

నా జీవితంలో ఎందరో మాతృదేవతల, సోదరీమణుల ఆశీస్సులు పొందాను. కేవలం తూర్పు దేశంలోనే కాదు పశ్చిమ దేశాల వారి ఆశీస్సులు కూడా అందాయి. వాళ్ళందరూ నన్ను వారి సొంత బిడ్డలాగా లేదా సోదరుడిలాగా భావించేవారు. మనము వారిని ప్రేమిస్తే వారు కూడా మనల్ని ప్రేమిస్తారు. నాకు, ఇతరులకు గజం దూరం ఉన్నా వారికి, నాకు కూడా అదే గజం దూరం ఉంటుంది. ఒకవేళ వేయి మైళ్ళ దూరం నేను ఇతరులతో ఉంటే వారు కూడా నాకు వెయ్యి మైళ్ళ దూరంగా ఉంటారు. దైవ నిర్ణయం అందరికీ ఒకే విధంగా వర్తిస్తుంది. అన్ని కాలాల్లో ఇదే వర్తిస్తుంది. ప్రేమించే వాళ్ళు ప్రేమించబడతారు అనే న్యాయం ప్రపంచంలోని వారందరి పట్ల ఒకే విధంగా వర్తిస్తుంది. మన హృదయంలో ప్రేమ ఉంటే ప్రపంచమంతా ప్రేమమయంగా కనిపిస్తుంది. కాని మనం కఠినంగా, ఈర్ష్య ద్వేషాలతో ఉంటే మనం ప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా మనకు కూడా అవే ఎదురవుతాయి.

దాదాపు నలభై సంవత్సరాల క్రితం 1929వ సంవత్సరంలో క్రిస్టమస్ పండగ దినాలు. మీరు ఎవ్వరూ ఊహించలేరు. అలాగే నేను కూడా మీకు వర్ణించి చెప్పలేను. నా స్నేహితులు, నా వద్ద ధ్యానం నేర్చుకున్న విద్యార్థులు, భక్తులు శాంతి కేంద్రాల సభ్యులు న్యూయార్క్ నగరంలోని వారే కాక అమెరికా అంతటి నుండి వచ్చిన వారందరూ వారి ప్రేమామృతాన్ని నా మీద వర్షింపచేశారు. శాంతి దేవి, శ్రీమతి జీన్‌లిల్లి, ఖర్బాన్, శ్రమకి వెనకాడకుండా క్రిస్టమస్ పండుగ వేడుకలు నా జీవితాంతము గుర్తుండిపోయేలా ఘనంగా చేశారు. చాలా పెద్ద క్రిష్టమస్ చెట్టుని నా గదిలో ఉంచి దానిని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. మంచి ఛాయాగ్రాహకుడిని పిలిపించి వేడుకల ఛాయా చిత్రాలు తీయించారు. నా మంచానికి కుడివైపుగా క్రిస్టమస్ చెట్టును పెట్టారు. శాంతిదేవి, సుశీలా నా మంచం దగ్గర కూర్చున్నారు. ఎడమవైపు జీసస్ క్రీస్తు ఛాయా చిత్రం చాలా అందమైన దానిని తెచ్చి అమర్చారు. ఆ రాత్రి అంతా ఆయన దివ్య స్మృతులతో పవిత్రంగా గడిపాము. అది క్రీస్తు అందమైన చిత్రపటము. దానిని నేను భారతదేశానికి తీసుకువచ్చాను. ఆ చిత్రపటము మాతృ సంస్థ అయిన శాంతి ఆశ్రమము తోటపల్లి కొండల్లోని సుశీలా మందిరంలో వ్రేలాడుతూ ఉంటుంది. దీని వలన పాఠకులకు ఆ రాత్రి నేను క్రిస్టమస్ వేడుకలను ఎంత ఆనందంగా గడిపానో బాగా అర్థమవుతుందని భావిస్తున్నాను. నా ఆత్మకథలో జీసస్ క్రీస్తు రంగుల చిత్రపటము గురించి, ఆయన దివ్య జీవనం గురించి ఉండాలని నా కోరిక.

**రోజాపూల మంచం పై స్వామీజీ :**

నా భక్తురాలయిన నర్సు ఒక చక్కని వ్యాసము వ్రాసి నాకు ఇచ్చింది. దాని పేరు రోజాపూల మంచంపై స్వామీజీ“దాదాపు రెండు వేల సంవత్సరాలకు పూర్వము గొఱ్ఱెల కాపరులు తూర్పువైపున ఒక దివ్య నక్షత్రాన్ని గమనించారు. అప్పటి నుండి తూర్పు నుండి

మహాత్ములు వస్తూనే ఉన్నారు. 1929వ సంవత్సరము క్రిస్మస్ పండుగ నాడు ఒక మహాత్ముడు మంచం మీద ఒంటి నిండా కట్లతో పడుకొని ఉన్నాడు చైతన్య రహితంగా, అందమయిన ఆయన దివ్య సన్నిధిలో ధ్యానము చేస్తుంటే, నాకు ఒక ఆలోచన వచ్చింది, అది మాకందరికి కూడా మళ్ళీ ఆయన తిరిగి జన్మించాడు అనిపిస్తోంది. ఆయన మమ్మల్ని అందరినీ మమ్మల్ని మేము తెలుసుకునేలా చేశారు. నిశ్శబ్ధంగా ఆ రాత్రి ఎంతో పవిత్రంగా గడిచింది.

ఆయన మంచం మీద ఉన్నా తన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏవీ మరిచిపోలేదు. వచ్చిన వాళ్ళకి మంత్రదీక్ష ఇవ్వటము, ధ్యాన తరగతులు నిర్వహించటము, ప్రవచనాలు, సందేశాలు యధావిధిగా కొనసాగించారు. వారి సందేశాలలో ఇలా వివరించారు. ఒకసారి జీసెస్ క్రీస్తు నలభై రోజులు పర్వతాల్లోకి వెళ్ళిపోయారని, వేరొక సందర్భంలో క్రీస్తు అక్కడ నిశ్శబ్ధంగా గాఢమయిన ధ్యానంలో మునిగిపోయి పరమాత్మతో అనుసంధానమయ్యారని చెప్పారు. నలభై రోజులు మౌనంగా గడపటం అనేది అమెరికా వంటి దేశాల్లో అసంభవమనిపిస్తుంది. కాని స్వామీజీ మా ముందే నలభై రోజులు మౌనవ్రతంలో ఉన్నారు. లెక్కలేనంత మంది పవిత్ర హృదయము గలవారు వారి గదిలో ధ్యానంలో గడిపి మౌనంగా కళ్ళనిండా నీళ్ళతో బయటికి వస్తుండేవారు. వాళ్ళు లోపలికి వెళ్ళేటప్పుడు ఏవేవో మాట్లాడాలనుకొనేవారు. కానీ స్వామీజీ పవిత్రమయిన సన్నిధిలో ఆధ్యాత్మిక ఆలోచనలు మాత్రమే ఉండేవి. మౌనంగా భగవంతునితో మాట్లాడి తిరిగి వచ్చేవారు. ఒక్కటే ఆలోచన కలిగేది మేము భగవంతుని ఉపకరణాలుగా పనికివస్తామో? అనిపించేది.

అమెరికా దేశమంతటా స్వామీజీ కార్యక్రమాలు నిశ్శబ్ధంగా జరిగిపోతున్నాయి. ఈ ప్రపంచం స్వామీజీ ఆధ్యాత్మిక ప్రేమను అర్ధం చేసుకునేంత స్థాయికి ఇంకా ఎదగలేదు. కాని వారు ప్రయత్నం చేస్తున్నారు. ఆయనలాగా జీవించాలని, ఆయనలాగా మాట్లాడాలని, ఆయన లాగా ప్రేమను పంచాలని ప్రయత్నిస్తుంటారు. వారి లాగా చాలామందికి కాకపోయినా కనీసం కొద్దిమందికి అయినా ప్రేమ అందించాలని అనుకుంటారు. చాలా సంవత్సరాల నుండి ఆయన కార్యక్రమాలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. ఎందరో ఉన్నత స్థితిని పొందారు. అందరు ఆయనని మహాత్ముడు అంటారు. భారతదేశానికి శాంతి కేంద్రాలకు మేమెంతో ఋణపడి ఉంటాము. అది మేము ఎన్నటికి తీరుకోలేము. స్వామీజీ మాకు అందించిన సేవలు అలాంటివి. నేను ఎంతో వినయంగా చెపుతున్నాను. ఆ మహానుభావుడికి కొన్ని నెలలు సేవలు అందించగలిగే అవకాశం దొరకటం నా అదృష్టం. ఆయన మాకు ఇచ్చిన దానికి మేము భారతదేశానికి, స్వామీజీకి ఎప్పటికి ఋణపడి ఉంటాము.

ఆమె ఒక ప్రార్ధనా గీతాన్ని కూడా రచించింది.

ప్రార్ధన – 1

కదిలించు నన్ను! ఓహ్ కదిలించు నన్ను! ప్రభూ!
అది ఏ విధంగా చేస్తావో నాకు తెలియదు
నీ ప్రేమ కోసం పరిపించే విధంగా నా హృదయాన్ని కదిలించు
ఇవ్వటానికీ, వెళ్ళటానికి, ముఖ్యంగా నిన్ను ప్రార్ధించటానికీ
నీ ఉనికి ద్వారా ప్రతి ఆత్మ కదిలేదాకా కదిలించు ప్రభూ!

కదిలించు నన్ను! ఓహ్ కదిలించు నన్ను! ప్రభూ!
నీ హృదయం దివ్యప్రేమ జ్వాలతో కదిలిపోయింది
నీ ఒక్కగానొక్క ప్రియాతి ప్రియమయిన కుమారుడిని
మాకు ఇచ్చివేసే దాకా కదిలిపోయింది
దుర్భరమైన శిలువ లాంటి జీవితం నేను గడపవల్సి వచ్చినా
నన్ను నేను నీకు సమర్పించుకునే విధంగా కదిలించు నన్ను
అప్పుడు ఇంక మళ్ళీ నీవు నా ద్వారా
నిన్ను నీవు ఇవ్వవల్సిన పని ఉండదు

క్రిస్టమస్ సందర్భంగా నాకు ఎన్నో విలువయిన బహుమతులు భక్తులు ఇచ్చారు. అలాగే శాంతాక్లాజ్, స్నేహితులనుండి కూడా బహుమతులు అందాయి. నేను ఎప్పుడూ శ్రీమతి జేన్ డి లిల్లి, మన శాంతా దేవికి ఋణపడి ఉంటాను. నేను అనారోగ్యంతో మంచంలో ఉన్నప్పుడు నా వైద్యం కోసం ఆమె చాలా డబ్బు ఖర్చుపెట్టింది. దాదాపు మూడు లక్షల రూపాయలకు పైగా ఆమె నా గురించి ఖర్చు చేసింది.

క్రిస్టమస్ పండుగకి వచ్చిన కానుకలన్నింటిలోకి విలువైనది సినిమాలు తీసే కెమేరా, ప్రొజెక్టరు. ఎప్పుడో ఒకసారి నేను మాతృసంస్థ అయిన శాంతి ఆశ్రమంలో ప్రొజెక్టర్ ఉంటే బాగుంటుందని, దాని వలన ఆశ్రమ కార్యక్రమాలు చక్కగా ప్రచారమవుతాయి అని చెప్పాను. అది విని గుర్తుంచుకున్న శాంతాదేవి చాలా ఉదారంగా ప్రేమతో, ముఖ్యంగా శాంతి ప్రచారం నిమిత్తమై దానిని నాకు బహుమతిగా ఇచ్చింది. కెమేరాతో పాటుగా, ప్రొజెక్టర్, తెర ఇంకా అవసరమయిన సామగ్రి కూడా తెచ్చింది. సినిమా తీయడానికి పనికివచ్చే వస్తువులన్నీ ఇచ్చింది. అది 16 ఎమ్.ఎమ్. సినిమా కెమేరా, అది ఇప్పుడు కూడా మా మాతృ సంస్థ అయిన శాంతి ఆశ్రమంలో వినియోగిస్తున్నాము. మా శాంతాదేవి, ఎంతో దయతో కొన్ని రీళ్ళను కూడా తెచ్చింది. అందులో ఒక సినిమా 4000 ఫీట్, అంకుల్ టామ్స్ క్యాబిన్ అనే ప్రసిద్ధ అమెరికా సినిమా అది. ఇంకొక సినిమా శాంతి ఆశ్రమానికి ఇచ్చింది. అది పాము, ముంగిస మధ్య పోరాటం ఇంకా కొన్ని భారతీయ చలన చిత్రాలు కూడా ఇచ్చింది. భగవంతుడికే తెలియాలి ఆమె వీటన్నింటి కోసం ఎంత ధనం ఖర్చు పెట్టిందో. ముందే ఆమె నా ఆరోగ్యం కోసం చాలా ధనం ఖర్చు పెట్టింది. అది కూడా ఎంతో ప్రేమతో, చిరునవ్వుతో ఖర్చు చేసేది. ఆమె నన్ను తన సొంత బిడ్డలా భావించి నా కోసం, నా సౌకర్యం కోసం ఎంతయినా ఖర్చు పెట్టడానికి సిద్ధంగా ఉండేది. నన్ను ఎప్పుడూ సంతోషంగా, సంతృప్తిగా ఉంచడానికి ప్రయత్నించేది.

ఆమె చాలా మంచిది. భగవంతుడు నా జీవితంలో మొదటి నుండి చివరి దాకా కొన్ని పరీక్షలు, ఇబ్బందులు కల్గించినా నా తుంటి ఎముక విరిగినా అది కూడా ఆశీర్వాదంగా మలిచాడు. దాని వలన ఎందరో ఆత్మీయుల, స్నేహితుల, భక్తుల హృదయంలో నా పట్ల ప్రేమానురాగాలు, సానుభూతి కలిగాయి. వారందరిని నాకు ఎంతో సన్నిహితులను చేశాడు. అందరికి ధన్యవాదాలు భగవంతుని బిడ్డలందరికి క్రిస్టమస్ పండుగ శభాకాంక్షలు.

# గాంధీ మహాత్ముని జయంతి సందేశము

పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ

## అహింస ద్వారానే ఏదైన సాధించగలము

బుద్ధ భగవానుని, ఏసుక్రీస్తు జీవితముల తరువాత ప్రపంచముకంతకు ఆదర్శ జీవితం మహాత్మునిదే. పవిత్ర భారతావనిలోని స్త్రీ పురుషులందరికి, దేశభక్తి, నిస్వార్థసేవ నేర్పిన జాతిపిత, వారి పవిత్రమైన సహాయ నిరాకరణోద్యమము ద్వారానే మనము పరహస్తముల నుండి స్వరాజ్యము అవలీలగ సంపాదించు కొనగలిగితిమి.

శరీరమునకు ఎంత అవసరమో అంత భోజనం చేయమనెడి వారు. జీవితము భుజించుటకు కాదని స్పష్టంగా చెప్పేవారు. మితాహారం, శాకాహారం తీసుకొనువారి దరికి రోగములు సాధారణముగారావు. వచ్చినను వాటిని ఉపవాసములతో, ప్రకృతి చికిత్సలతోనే నివారణ చేసుకోవాలని వారు ఆచరణ ద్వారా అందరకు చెప్పెడివారు. ప్రతివారు స్వయముగా ప్రత్తినుండి ఏకులు తయారు చేసి రాట్నము మీద నూలువడికి, ఖద్దరు బట్టలనే ధరించుట చాల ఉత్తమ పద్ధతనేవారు, రెండవ పక్షము ఖాదీ బట్టలనే వాడుట మన కర్తవ్యము. భగవంతుడు మనకు మానవజన్మను ప్రసాదించినప్పుడు మానవునిగనే సుఖంగా జీవించక, మద్యపానం చేసి పశువులవలె జీవించుట తగదనియు మద్యపాన నిషేధము దేశక్షేమమున కెంతయో అవసరమని చెప్పుచుండెడివారు. వస్త్రములను గాని, ఆహార పదార్థములను గాని తమకు అవసరమున్నంతవరకే సంపాదించుకోవాలి గాని హెచ్చుగా కూడబెట్టి దాచుట పాపమనియు చెప్పిరి. నేటి పాపి రేపు సాధువు కావచ్చును గాన, పాపిని ఎన్నడు ద్వేషించవలదు. పాపమును ద్వేషించమని చెప్పేవారు. గాంధీగారు అట్లు ఆచరించి చెప్పుట వల్లనే మహాత్ముడయ్యెను.

పూజ్యశ్రీ స్వామీజీ సదా చెప్పుచున్నట్లు మానవులందరు దైవబిడ్డలేగాన ఒకరినొకరు ద్వేషించుకొనక, తమను తాము, తమవారిని ఎట్లు ప్రేమించు చుంటిరో, సర్వులను అట్లే ప్రేమించుచు, ప్రతిఫలాపేక్ష లేకుండా సహాయం చేయుటే, మన శాంతి సుఖములకు దగ్గర మార్గమనియు, ఎవరు ఏ పేరుతో పిలచినను అన్ని మతములకు దైవమొక్కడే, ప్రపంచమంతా ఒకే కుటుంబ మనియు, మతములు, కులములు పోనక్కరలేదనియు, ముఖ్యముగా పోవలసినది మన హృదయములలోని కలుషత్వము, ద్వేషభావమేననియు, అది తొలగించుకొనిన ప్రపంచమంతయు ప్రేమమయ మగుననియు, నిరంతరం సెలవిచ్చుచుందురు.

గాంధీ మహాత్ముడు హిందూ మహమ్మదీయ సమైక్యతకు ఎంతయో కృషి చేసిరిగాని ఫలించలేదు. లార్డు మౌంట్ బాటన్ మనకు స్వరాజ్యమిచ్చు చున్నట్లు తృప్తిపరచి, భారత దేశమును రెండుగా చీల్చి మహమ్మదీయులకు పాకిస్తానును ప్రసాదించెను. గాని ఎవరి

స్వభావములను ఎవరు తేలికగా మార్చగలరు? మొగల్ రాజ్యము అంతరించినప్పటి నుండియు తిరిగి హిందూ దేశమంతయు మహమ్మదీయ రాజ్యం స్థాపించవలెనని మహమ్మదీయులు ప్రయత్నం చేయుచునే యున్నారు. మహాత్ముడు చూపిన సత్య అహింస మార్గములలో నడచుచు, శాంతిగా నుండుటకు బదులు వారు ఆనాడు ఆత్మ నిగ్రహముతో జరిపిన సహాయ నిరాకరణోద్యమ పవిత్రతను తెలిసికొనలేక, ఈనాడు ప్రతి చిన్న విషయమునకు సమ్మెలు చేయుచు దేశములో అశాంతి అల్లకల్లోలములు రేపుచు అనవసర ఆవేశములతో, బస్సులు వగైరాలు తగులబెట్టుచు ప్రభుత్వ నష్టము ప్రజానష్టమేనని గుర్తించకపోవుట విచారకరము. ఇట్టి అశాంతి పరిస్థితులలో గాంధీజయంతి ఉత్సవములు గాంధీ తత్త్వమును సరిగా గుర్తించలేక జరుపుకొనిన ఏమి లాభము? మనము వారి అడుగు జాడలలో నడచుచు, సత్యము అహింసలను పాటించుచు సన్మార్గ వర్తనులమై, దేశాభ్యుదయమునకు సర్వుల క్షేమమును కోరుచు ప్రేమతో జీవించినప్పుడే గాంధీ జయంతిని జరుపుకొనిన ప్రయోజనముండును.

వందేమాతరం

లోకాసమస్తా సుఖినోభవంతు

(శాంతి - అక్టోబర్ 1979)

**ఉపవాస చికిత్స**

ఉపవాసము శరీరనిర్మాణమును పునరుద్ధరించి శక్తివంతము చేయును. క్రొత్తధాతువులు, కణములు తయారగును. శరీరము శక్తితో, జీవనముతో వెలయును. ఉపవాసము నరములను, నరముల కూడలిస్థానములను శుభ్రపరచి అవయవములకు మితిలేని జీవశక్తిని కలిగించును. మనస్సు సంశయ నివృత్తినొంది బలపడును. సంకల్ప శక్తిని అభివృద్ధి పరచును.

ఉపవాసమున్నప్పుడు తిండినిగూర్చి ఆలోచింపకుము. మనస్సును పూర్తిగా దైవచింతనతో నింపుము. నీవు నీ నిత్యకృత్యములను, ఇతర పనులను చేయగలవు. నీవు నడువగలవు. చదువ గలవు, ధ్యానము చేయగలవు. అధిక సంఖ్యలో జపమును, ధ్యానమును ఆభ్యాసము చేయుము. సత్కర్మలను చేయుచుండుము. సోమరిగా మంచములో పరుండకుము. అట్లు చేసినచో అది అబద్ధపు ఆకలిని, చెడ్డ ఆలోచనలను ప్రోత్సహించును. ఉపవాసమైన పిదప ఆహారమును సరిదిద్దుకొనుము. భోజనమునందు పాత అలవాట్లను మానివేయుము. క్రొత్త ఆరోగ్యకరమైన విధానముతో జీవించుము.

**- స్వామి శివానంద మహరాజ్**

# దసరా

**శ్రీ శివానంద స్వామి**

## శివుడు – శివ పూజ

దేవిని పూజించుటకు దసరా హిందువులకొక గొప్ప పండుగ. ఈ ప్రపంచమునందు హిందూమతము, మాత్రమే దేవుని మాతృత్వమును బలపఱచు మతమైయున్నది. మానవులందరికి తల్లి ప్రియతమము మరియు మధురతమమై భాసించును. కావున దేవుని తల్లిగా భావించుట భావ్యమేయగును.

దసరా, దుర్గాపూజ మఱియు నవరాత్రి ఒకే అర్థము నొసంగును. శివుని శక్తియే దుర్గాదేవి. ఆమె పరమాత్ముని శక్తికి ప్రతీకమువంటిది. దేవుడు మఱియు అతని శక్తి యందు భేదము లేదు. ఆమె ప్రపంచము యొక్క బాగోగులను చూచుకొనును. దివ్యజనని యొక్క అంశయగు దుర్గాదేవి యొక్క పదిచేతులలో పది ఆయుధములు ఉండును. ఆమె ఒక సింహము పై కూర్చుండును, క్రూరశక్తికి ప్రతీకమగు సింహమును వాహనముగా చేసికొనుటచే ఆమె సమస్త శక్తులను తన స్వాధీన మొనర్చుకొన్నట్లు తెలియుచున్నది.

దేవతలు, మనుష్యులు, పశువులు, సముద్రములోని జీవులన్నింటియందు వ్యక్తమగు పరమాత్ముని శక్తియగు జగజ్జననితో అనబిర్ణముని పుత్రియగు వాక్కుతాదాత్మ్యమునొందిన ఒక విషయము ఋగ్వేద సంహితలోని దేవీ సూక్తమునందు నీకు లభించును.

జగజ్జనని ఇంద్రునికి మఱియు దేవతలకు జ్ఞానము నొసంగెననియు మఱియు పరమేశ్వరుని శక్తి యొక్క సహాయము చేతనే దేవతలు రాక్షసులను ఓడింపఁగలిగిరనియును కేనోపనిషత్తునుడువును.

మహిషాసురుడనెడి మహా అసురుడు దేవతలను మిక్కిలి బాధించుచుండెను. దేవతలు దుర్గాదేవి యొక్క సహాయమును అర్థించిరి. ఆమె పదితలలు మఱియు ఆయుధములుఁగల పది చేతులున్న రూపమును ధరించి, అసురుని సంహరించెను. దేవి భాండాసురుడు మరియు అతని శక్తులతో తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు యుద్ధమొనర్చి, పదియవరోజు సాయంకాలము సమస్త అసురులను నశింపఁజేసెను. ఇదియే విజయ దశమియని చెప్పఁబడును. ఈ పదిరోజులున్నూ దేవికి పవిత్రములై యున్నవి.

బెంగాల్ దేశములోని హిందువులు విజయదశమికి ముందు మూడురోజులు దుర్గాదేవిని పూజించి, విజయదశమిరోజు ఉద్వాసన కార్యక్రమమును జరుపుదురు. వసంతపూజ (మార్చి–ఏప్రిల్) సమయంలో కూడా దుర్గాదేవి పూజింపఁబడును.

హిమవంతుని భార్య, దుర్గాదేవి యొక్క తల్లి తన కూతురగు దుర్గను చూడఁగోరును. సంవత్సరమునకు మూడురోజులు మాత్రమే తన తల్లిని చూడవచ్చునని దుర్గాదేవికి శివుడు అనుమతి నొసంగెను. దుర్గాదేవి తన తల్లి వద్దకి వచ్చి, మరల విజయ దశమిరోజు కైలాసమునకు వెళ్ళు ఈ మూడు రోజులలో దుర్గాపూజ జరుపబడును.

రావణునితో యుద్ధమొనర్చు సమయములో శ్రీ రాముడు తనకు యుద్ధములో సహాయ మొనర్చుటకై విజయదశమికి ముందు దుర్గాదేవిని పూజించెను. ఆమె యొక్క అనుగ్రహముచే అతడు యుద్ధమొనర్చిజయించెను.

బెంగాల్ దేశమునందు దుర్గాపూజ ఒక పెద్ద ఉత్సవము. ఇంటికి దూరముగానున్న వారందరు పూజాదినములలో ఇంటికి తిరిగి వత్తురు. తల్లులు దూరముగానున్న తమ కొడుకులను, కూతుర్లను మరియు భార్యలు తమ భర్తలను ఈదినములలో కలిసికొందురు.

కుమ్మరి వాడు మూర్తులను తయారుచేయుటలోను, కళా కారుడు బొమ్మలు వేయుటలోను, గాయకుడు తన వాద్య నినాదము చేతను మఱియు పండితుడు సద్గ్రంథపఠనము నందును తన నేర్పును ప్రదర్శించును. బెంగాలీలు తాము సంవత్సరము పొడుగున సంపాదించిన ధనమంతటిని ఈ పూజా దినములలో ఖర్చు పెట్టుదురు. వస్త్రములను కూడా వితరణ యొనర్తురు.

బెంగాల్ దేశములోని హైందవ స్త్రీ, దేవిని తల్లి ప్రేమతో ఆహ్వానించి, చివరిరోజు ఆమె తన భర్త ఇంటికి వెళ్ళునప్పుడు తన కళ్ళలో నీరు తెచ్చుకొని, దేవిని సాగనంపును.

మీరందఱు దుర్గాదేవిని భక్తి శ్రద్ధలతో ఆరాధించి, ఆమె యొక్క అనుగ్రహము ద్వారా శాశ్వతానందమును మరియు అమృతత్వమును బడయుదురు గాక! విశ్వమునకు మాతాపితలైన జగజ్జనని దుర్గాదేవికి మఱియు జగత్పితయగు శివునికి జయమగును గాక!

వారణాసికి పది పన్నెండు మైళ్ళ దూరములో ఒక మహాత్ముడు ఉండెడివాడు. ఆయన గొప్ప నిష్ఠగల తత్త్వవేత్త; కాని, బండ మనిషి, ఆయన తన వద్దకు వచ్చినవారిని తిట్టెడివాడు. నేను కూడ ఆయన వద్దకు వెళ్ళుచుండెడివాడను. ఒకప్పుడు ఆయన నన్ను కుర్చీ పై కూర్చుండబెట్టి మెడలో పూల మాలను వేసెడివాడు. మరొయొకప్పుడు తిట్టెడివాడు. ఒక రోజు ఆయన ప్రసన్నముగా నుండుటను చూచి, ఓ మహాత్మా! మీరు తిట్టుటకు కారణమేమి? అని ప్రశ్నించితిని. ఆయన ముఖ కవళికలు వెంటనే మారిపోయెను. ఆయన రోషమును పొంది వెంటనే తిట్ల వర్షమును కురిపించెను. ఆయన ఇట్లు పలికెను. నా తిట్లు నీకు చేటును తెచ్చునా? ఓ తమ్ముడూ! ఇది సంసారము. దీనిలో మనకు దక్కేది తిట్లు మాత్రమే. నీవు నా తిట్లను సహించలేక పోయినచో, సంసారములో ఏ దారిన నడిచెదవు? ఇక్కడ ఎవడు సహిస్తాడో, వాని అంతఃకరణములో దృఢనిష్ఠ ఉదయించి, పరిపక్వత కలుగును. దుఃఖమునుండి పారిపోకు. దానిని సహించు! దానితో యుద్ధమును చేయకు. దానిని ప్రేమించు! దానిలో నీకు ప్రేమరసము లభించినప్పుడు, దానికి రసాయనిక కాయకల్ప చికిత్స జరిగి, అది పరమాత్మ రూపములో దర్శనమిచ్చును.

భక్తజనులు భగవానుని నుండి దుఃఖమును వరముగా కోరుటకు గల కారణము నాకు మొదటి సారిగా అప్పుడే తెలిసినది.

**(స్వామి అనుభవానంద వారి బ్రహ్మానుభూతి అను గ్రంథము నుండి)**

# రామ - రామీ

స్వామి ఓంకార్ స్వేచ్ఛానువాదం, తారకం

## అన్నింటియందు పరమేశ్వరుని దర్శించినవాడు పండితుడు

నా జీవితంలో 'రామ–రామీ' రెండు లేవు. ఆ రెండూ నాలో ఒక్కటే భాగం. 'రామ'ను 'రామీ'లోను,'రామీ'ని 'రామ'లోను, నేనెప్పుడూ చూస్తుంటాను. ద్వైతం అజ్ఞానం,అద్వైతం జ్ఞానం.

నాలుగేండ్ల క్రితం 'రామీ' శాంతి నిలయంలో పుట్టింది. చిన్నపిల్లగా ఉన్నప్పటి నుండే, నాకూడా వచ్చేది. కావలసినంత నీరు త్రాగేది. నా స్నానపుగదిలోకి వెంబడించి, నీళ్ళుత్రాగి నిద్ర పోయేది. నన్నెప్పుడూ విడువకుండా ఉండేది గనుక, మేము కోటగిరి విడిచి మాతృ ఆశ్రమానికి పయనమవుతోంటే, తోటపల్లి మాతో కూడా వచ్చేసింది.

శీతల వాతావరణంలో పుట్టినా ఉష్ణోగ్రత ఉన్న ప్రదేశంలో కూడా హాయిగానే ఉండేది. గీత ఉపదేశానుసారం, శీతోష్ణాల భేదం లేకుండా, అన్ని పరిస్థితులలోను, అన్ని మార్పులలోను మనుష్యుల గుంపులలోను, ఏకాంతంగా నిశ్శబ్ధంగా ఉన్న స్థలంలోను ఒకేరీతిని ఉండాలి. రామీకి ప్రశాంత వాతావరణం ఇష్టం. మే మెక్కడికి వెళ్ళినా, ఒక ఏకాంతస్థలం వెతుక్కుని అక్కడనే విశ్రాంతి పొందేది. ఎవరన్నా రామీకి ఇష్టమే, కొత్తవారు, పిల్లలు, ఎవరు దానిని మచ్చికచేసి ఆడించినా, అంగీకరించేది. స్నానం చేయించే సమయంలోకూడా, కిక్కురుమనకుండా, పిల్లలు ఎలా తోమినా, శుభ్రపరచినా చేయించుకొనేది. రామీకి పరాయి వారంటూ లేరు. తానెంతో ఆప్యాయంగా, నెమ్మదిగా ఉండేది. అంతా తనవారే. అందరూ తనవాళ్ళే అనుకొనడం ఎంత పుణ్యం! అనేక మానవులకు కూడా ఈ భాగ్యం ఉండదు.

తోటిపల్లి శాంతి ఆశ్రమ ప్రాంగణంలో, జూన్ 12వ తేదీని రామీ ప్రాణం విడిచిందని వార్త వచ్చింది.

'రామీ' ఇంక లేదు.

ఇంక "రామీ"ని చూడలేమా? ఆ దేహాన్ని చూడలేము కాని, ప్రేమ పూరితమైన దాని ఆత్మ అంతటా ఉన్నది. కాయాన్ని విడిచిపోయిన ఆత్మ దానిని ప్రేమించే వారలలో లయమవుతుంది అంటారు. రామీ నన్ను వదలకుండా, నా నీడవలెనే వుండి, నన్ను ప్రేమించేది. నేనూ రామీని నా స్వంతంగానే భావించేవాడను. కాబట్టి రామీ ఆత్మ, తన భక్తి విశ్వాసాలతో, ప్రేమ నైర్మల్యంతో, ఏకాంతంగా నాలో లీనమై పోయి ఉండవచ్చును. దుఃఖం, ఎడబాటు బదులు, ఈ సమయంలో రామీ ప్రేమ, ఆత్మానుభూతి, నాలో ప్రతిమూల, సుస్థిరమయ్యాయి. రామీని ఏనాటికైనా ఎట్లా మరువగలను? రాముడు అమరుడు. రామీ, రాములు ఒక్కటే. రామంలో రామీని, రామీలో రామాన్ని చూస్తోంటాను. అంతేకాదు. మీ అందరిలోను నాకు రామదర్శనం అవుతుంది.

"బోట్" 'జోయ్' అనే అమెరికన్ దంపతులు. "శక్తి" అనే బిడ్డతో సహా, చాలా కాలం మా శాంతి కేంద్రంలో ఉండేవారు. ఇది "బోబ్" జన్మదినం. ఆయన విశ్వ కుటుంబానికి చెందినవాడు. సమస్త జనుల శాంతి కాంక్షించే వ్యక్తి. బీదలకై, అన్న దానం చేస్తూ అన్ని మతాలకి చెందిన హిందూ, మహమ్మదీయ, క్రైస్తవ బిడ్డలకు విందు చేయించాడు. ఇంగ్లీషు, తమిళం, తెలుగు భాషలలో ప్రార్థనలు గావించాడు. తమ బడి పిల్లలతో వచ్చిన ఇద్దరు సన్యాసినులు, క్రైస్తవ ప్రార్థన ఐక్య కంఠంతో పఠించారు. భజనలు, ధ్యానం జరుపబడ్డాయి.

చుట్టుపట్ల అంతా ఉత్సాహంతో నిండిపోయింది. అందరూ సంతోషంగా ఉన్నారు. కాని, నా ప్రాణం కొంత చివుక్కుమంది. “రామీ” సన్నిధిని అనుభవించాను. ఆ ఉత్సవంలోనే కాక, నాలో నేను రామీ సామీప్యాన్ని పొందగా, నాకు తెలియకుండానే, నా నయనాలనుండి, అశ్రువులు ప్రవహించాయి. “రామీ ఇక్కడనే ఉన్నది.రామీ,నేనూ ఒకటే అని పదేపదే అన్నాను. జగత్తులో ఉన్న ప్రాణులన్నిటి కొరకు పశుపక్ష్యాదులు, మానవులు మూగ మృగాలు, సుగంధ పుష్పాలు ఇత్యాదులన్నిటి కొరకు,హృదయాలు స్పందించే విశ్వ కుటుంబీకులందరికి నా ధన్యవాదాలు.

రామీ మాతృ ఆశ్రమంలో ఉన్న మూడు సంవత్సరాలలోను సంభవించిన కొన్ని మధుర స్మృతులను నా ప్రియమైన పాఠకులతో పంచుకొనకపోతే, నా సందేశం సంపూర్తి కాదు.

తోటపల్లిలో రామీ జీవితయాత్ర అరుణోదయ కాంతులలో ప్రతిదినం, బడా రామీతో సహా చిన్న రామీ నిర్వాణ మందిరంలో ఉన్న నా వద్దకు పరుగు పరుగున వచ్చేవి. నేను

‘రామ, రామ యనుమా రామీలు, రాముని మరువ కుడీ రామీ’లు అని ఆ జంటకు నేర్పేవాడిని.

ఈ చిన్న మంత్రాన్ని వాటికోసం కూర్చి, ప్రతిరోజూ నేర్పేవాడిని, అవి అలవరుచుకొని, ఆ మంత్రాన్ని కొన్నిసార్లు ఉచ్ఛరించిన తరువాత, వాటికి బిస్కట్లు ఇచ్చేవాడను, నేను వాటిని శివాలయం వైపు తీసుకొని వెళ్ళడానికప్పుడు వేచియుండేవి, నేను జ్ఞాన గుహలోనికి వెడితే, అవికూడా నన్ను వెంబడించి, నాతోపాటు గంటల కొలదీ, మెదలకుండా ఉండేవి.

రామీ 1 మాసం పిల్లగా ఉండగా కోటగిరిలో నన్ను అంటియే నా స్నానం గదిలో ఉండేది. తోటపల్లిలో, అది పెద్దదైన పిదప నేను స్నానం చేస్తోంటే, సుఖంగా ఆ గదిలో ఒక మూల కూర్చొని ఉండేది. నమ్మలేనంత చిత్రంగా ఉండేవి రామీ చేష్టలు. స్నానం చేసి, ఒళ్ళు తుడుచుకొంటూంటే, రామీ కూడా తుడిచినట్లు నా తడి పాదాలను నాకేది.

నేను భోజనం చేసేటప్పుడు రామీ నా కుర్చీ క్రిందనే పడుకొనేది. రామీకి శాఖాహారమే ఇష్టం. పాలు, అన్నం తినేది అప్పడాలంటే దానికి చాలా ఇష్టం. జంతికలు మొదలైన వాటిని కూడా తినేది. మనిషివలె పొత్తులను వలచుకొని తినేది.

ఎప్పుడూ మానకుండా, ముఖ్యంగా ఆదివారాలలో, నా ఆధ్యాత్మిక ప్రసంగాలకు నాతో వచ్చి, నా కుర్చీ క్రిందనే కూర్చోవాలని పట్టుబట్టేది. ఆదివారం వచ్చినదంటే చిత్రంగా తానే నాకంటే ముందు తయారై, ప్రార్ధనలు జరిగే హాలుకు వెళ్ళి, నా కుర్చీ క్రింద ఉండేది.

మేము చుట్టుప్రక్కల గ్రామాలకి శాంతి సందేశాన్ని ఇవ్వడానికి వెళ్ళినప్పుడల్లా శాంతి శకటంలో ఎక్కి మాతో వెళ్ళడానికి, రామీ కెంతసరదానో చెప్పలేను. ఒక పెద్ద మనిషిలాగ, కూర్చునే స్థలంలో సీటుమీద ఆశీనుడై, నెమ్మదిగా, ఏమీ అరవకుండా దారికిరువైపులా చూస్తూ వుండేది.

తన శరీరం పోయేరోజు ఉదయమే పోస్టుమాస్టరు సూర్యనారాయణతో శివాలయమునకు వెళ్ళి అక్కడ అభిషేకము చేయుచుండుట రామీ దగ్గర కూర్చుండి వీక్షించుచుండెను. ఒక్క విషయం మాత్రం నాకు విచారాన్ని కలిగించేది. బడారామీ ప్రోత్సాహంతో మా ఛోటారామీ కూడా కొందరు మనుష్యులను చూచినపుడు మొరిగేది. నన్నెవరూ ధ్యానంలో ఉండగా, తపస్సుని భంగం చేయకూడదని కాబోలు అవి కొందరిని చూచి మొరిగేవా అనుకొని ఆశ్చర్యపడేవాడిని. అరుదుగా అవెప్పుడైనా మనుష్యులపైపడి కరిచేటంత గొడవచేస్తే, నాకు బాధాకరంగా ఉండేది. ఈ విధంగా జరిగే సమయంలో, ఆ మనుష్యుల తలంపులు పరి శుద్ధమైనవి కావని, వారిని ఆధ్యాత్మిక దృష్టి ఎక్కువగా అలవరచుకొనమని ముఖ్యంగా, నా యెదుట, ఈ పవిత్ర ఆశ్రమంలో అనే భావంతో రామీలు చేసే హంగామా కాదుగదా అని

తలంచేవాడిని. రామీలవిషయంలో అవియెప్పుడైనా ఎవరినైనా కరుస్తే మాత్రం నేను బాధపడేవాడిని.

ఆశ్రమవాసులు ఎన్నడైనా సత్సంగగోష్ఠి అయిన తరువాత రాత్రి చీకటిలో తమ వసతులకు పోతుంటే, వారిని మా రామీ, కూడా వెళ్ళి క్షేమంగా విడిచివచ్చేది. అనేకసార్లు విశ్వాలయ చిహ్నం పైన రామీ కూర్చొని, వచ్చేపోయే వారిని, ఆ చిహ్నాన్ని ఉద్దేశించి ధ్యానం చేయమని ఆహ్వానిస్తోందా అనుకొనేటట్లు వీక్షించేది. విశ్వజననీనతయే తన స్వభావమా అనిపించేటట్లు ఆ చిహ్నాన్ని అంటి పెట్టుకొని సమస్తమత విశ్వాసాలను పలకరించినట్లుండేది. చోటా రామీ ఏసుక్రీస్తు పిలిచిన రీతిని, చిన్న పిల్లలనందరిలోను ఆడుకొంటూ, నా వద్దకు రండి అనేటట్లుండేది. రామీ సామాన్యమైన కుక్కకాదు. కుక్క స్వరూపంలో ఉన్న మానవుడే అని నేను తలవడానికి ఇంకా ఎన్నో నిదర్శనాలున్నాయి. ఆ స్వానుభవాలన్నీ వ్రాసి నా పాఠకులకు విసిగించను.

కొన్ని తడవలు రామీ దిండు మీద తలపెట్టుకొని సోఫామీద శయనించేది. అనేక సార్లు నా పాదాలమీద శిరస్సు వుంచి రామీ నిద్రించేది.

ఇంక రామీ యొక్క అపారమైన ప్రేమ, భక్తిని గూర్చి ఎంత వ్రాస్తే తనివితీరుతుంది? ఒక్కటే నేను చేసేది. రామీకి ఎన్నో మానవ స్వభావాలు ప్రసాదించిన, అది శునకరూపాన్ని ఉన్న మనిషే అనిపించేటట్లు ఆశీర్వదించిన పరమాత్మునికి, ధన్యవాదాలు సమర్పించడమే, నా వంతు. తోటపల్లి కొండలు నీలగిరి పర్వతాలకు వేయి మైళ్ళ దూరంలో ఉన్నాయి. పరమేశ్వరునికి దూరమనేది లేదు కనుక, తన కుక్క రూపాన్ని విడిచినతోడనే, రామీ నా హృదయంలో ప్రవేశించిందనుకొంటున్నాను.

ఏ మూలమునుండైనా ఎవ్వరినుండియైనా సరే, మంచినే గ్రహించడం నా సహజ వృత్తి స్వభావమూ కాబట్టి ఆ తావు నోరులేని జంతువులు కాని, పక్షులు కాని, చిన్న పుష్పం కాని, ఒక్క రామీయే కాదు. ఈ నాటి నుండి, రామీ ప్రేమను ముందు ముందు ఎక్కువగా వ్యక్తపరచుటకు కోరుచుంటిని ఈ దినములలో, రామీ అని ఉచ్చరించగానే, నా పిలుపుకి సమాధానం వెంటనే అన్నివైపుల నుండి వస్తుంది. ఎందుకంటే రామీ, రాములు ఇరువురు కారు ఒక్కటే.

మనకు గోచరించే వైవిధ్యంలో ఏకత్వం ఒకే రాముని చూడగలిగినవారు ధన్యులు.

రామీ శరీరం విడచెను. రామీ జీవించియుండగా, నేను హెచ్చుగా తోడ్పడలేదన్న విచారమే మిగిలియున్నది. రామీ ఇప్పుడు మానవజన్మ నెత్తిననుట ఆనందము. రామీ ఆత్మ ఏదో ఒక శరీరంలో ప్రవేశించివున్నది. గాన, అందరినీ ప్రేమించుటయే రామీని ప్రేమించుట.

ప్రేమయే దైవము! దైవమే ప్రేమ! రాముడు, రామీ రెండుకావు, ఒక్కటే!

రామీ ఆత్మకు, రాముడు, శాంతినిచ్చి బ్రోచుగాక!

నిస్సందేహంగా రాముడు, రామీ ఒక్కటే ఇద్దరు కారు. సృష్టిలోని చైతన్యం, ప్రకాశం, హృదయం ఎవరో, చేతనా చేతనములలో వుండే ఏకైక కాంతి ఎవరో ఆ ఏకనాథుని మౌనంలో ఆరాధిస్తున్నాను.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతుః ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

**చిన్ని కానుక**

మా ప్రేమ ప్రసంగం, రామీకి ఈ చిన్ని కానుక సమర్పిస్తున్నాను. విశ్వాత్మతలో ఆ ఆత్మకు శాశ్వత శాంతి నొసంగమని నా ప్రార్థన. ప్రాక్ పశ్చిమాలలో ఉండే జంతు జాలమంతటికీ నా శుభాకాంక్షలు. (శాంతి సెప్టెంబర్ 1971)

# అద్భుతమైన పరివర్తన

మూలము : స్వామి రామదాస్ అనువాదము : గరిగిపాటి కృష్ణ

## కృష్ణార్పణం

పురన్దర దాసు అనే ధనిక వ్యాపారి ఉండేవాడు. అతడు చాలా పిసినారి. భగవంతుడు అతనిని పరిక్షించదలిచి ఒక హరిదాసు వేషంలో కొడుకు ఉపనయనము కొరకు సహాయమర్థించడానికి ఆరునెలలపాటు ప్రతిరోజు ఆ వ్యాపారి వద్దకు వెళ్ళేవాడు. ఆ ధనికుడు సహాయం చెయ్యడానికి నిరాకరించేవాడు. అంతేకాక ఆ హరిదాసును దూషించి ప్రతిరోజు వెళ్ళగొడుతూ ఉండేవాడు. ఇలా ఆరు నెలలు గడిచాయి. చివరిగా, ఆ వ్యాపారి ఒక చెల్లని నాణెమును ఆ హరిదాసుకు ఇచ్చాడు. అప్పుడా హరిదాసు వ్యాపారి భార్యను కలసి తాను ఆరు నెలల నుండి ప్రతిరోజు ఒక వ్యాపారిని కలిస్తే చివరిగా తనకొక చెల్లని నాణెమును ఇచ్చాడా దుర్మార్గుడని చెప్పాడు. అతని భార్యకు హరిదాసు చెప్పకనే చెప్పిన ఆ వ్యాపారి ఎవరో తెలిసినా ఆమె తన భర్తను దుర్మార్గుడనడం సహించలేకపోయింది. ఆమె ఆ హరిదాసును పంపివెయ్యడానికి ఇలా అంది. "నీకేం కావాలి? నేను నీకు కొంత ధాన్యము మాత్రమే యివ్వగలను."

హరిదాసు "లేదు నాకు ధనము కావాలి."

**వ్యాపారి భార్య :** నా వద్ద ధనము లేదు.

**హరిదాసు :** నీవు యివ్వాలనుకొంటే, నీవద్ద సరిపడా ఉంది. నీ దగ్గర వజ్రపు ముక్కు పుడక ఉంది. అది నా అవసరాన్ని చక్కగా నెరవేర్చగలదు.

ఆమె హరిదాసు మాటలకు సందేహించడము చూసి హరిదాసు ఇలా అన్నారు. నీవు ఆ నగ ఇవ్వడానికి ఇష్టపడనట్లైతే, నాదారి నేను చూసుకుంటాను.

దానికా వ్యాపారి భార్య, లేదు లేదు. నీవు సాక్షాత్తు భగవంతుని రూపానివి. నేను నీవు కోరిన దివ్వకుండా ఎలా పంపించగలను? అన్నది.

అప్పుడా స్త్రీ తనముక్కు నుండి నగను, తీసి, ఆ హరిదాసుకివ్వడానికి సిద్ధపడింది. అంత హరిదాసు ఆమెతో, నీ భర్తకి విషయము తెలిస్తే అతడు నిన్నేమి చేస్తాడో కదా" అంటాడు.

దానికామె, అతనితో నాకేమి పని? అవసరమైతే మీకోసము నా ప్రాణాలు ఇవ్వడానికైనా సిద్ధముగా ఉన్నాను. అప్పుడా హరిదాసు ఆమెతో, అయితే, నీవు "కృష్ణార్పణమ్" అంటూ ఆ నగ నా చేతికియ్యి, అంటాడు.

అంత ఆ స్త్రీ, "కృష్ణార్పణమ్" అంటూ ఆ నగను హరిదాసు చేతిలో పెట్టింది. అప్పుడా హరిదాసు అక్కడినుండి తిన్నగా ఆ వ్యాపారి వద్దకు ఆ నగను అమ్మడానికి వెళ్ళినట్లు వెళ్ళాడు. హరిదాసు తన వద్దకు రావడము గమనించిన వ్యాపారి, కఠినమైన స్వరముతో "సిగ్గు లేదా మళ్ళీ నా వద్దకు ఎందుకు వచ్చావు?" అన్నాడు.

అప్పుడు హరిదాసు నేను నీ వద్దకు వ్యాపార నిమిత్తమై వచ్చాను. అంతేకాని నిన్ను యాచించడానికి రాలేదు అంటూ ఆ నగను అతనికిచ్చి, ఈ నగ విలువ నిర్ధారించి ఆ పైకము నాకు యివ్వు అంటాడు. వ్యాపారి హరిదాసు వద్ద నుంచి నగను తీసుకొని చూడగా అది తన భార్య వజ్రపు ముక్కుపుడకగా గుర్తించాడు. అప్పుడా వ్యాపారి, ఈ నగ నీకెక్కడ లభించింది అని అడిగాడు. అంత హరిదాసు, ఒక ఉదార స్త్రీ తనకు ఆ నగను కానుకగా బహూకరించింది అని చెప్పాడు.

**వ్యాపారి :** "ఏయ్ దొంగా, నీకు ఇది బహుమతిగా లభించింది అనడము నిజమేనా?"

**హరిదాసు :** "దొంగ! కృష్ణుడు కూడా దొంగయే కదా."

**వ్యాపారి :** " కృష్ణుడు దొంగ అయితే నీవు కూడా దొంగతనము చెయ్యాలా? సరే, నీవు రేపు వస్తే, నేను నీతో వ్యవహారము గురించి మాట్లాడుతాను."

హరిదాసు అలాగేనని వెళ్ళిపోయాక, వ్యాపారి కోపావేశంతో ఊగిపోతూ ఇంటికి వచ్చి తలుపు తీయమని తలుపు మీద దబదబా కొడతాడు. ఆ శబ్ధానికి, వచ్చినవాడు మరొక యాచకుడని భావించి, వచ్చినవారు గోపాలదాసయ్యేనా? అని వ్యాపారి భార్య అడుగుతుంది. దానికా వ్యాపారి, అవును, గోపాలదాసయ్యనే, నేను నీ చెంప పగలగొడితే గోపాల దాసయ్య కనిపిస్తాడు. తలుపు తెరు, అంటాడు. అప్పుడామె తలుపు తెరవగా వ్యాపారి, నీవు యాచకుడికి ఏమి ఇచ్చావు, అని అడిగాడు.

**భార్య :** "నేను భిక్ష ఇచ్చాను," అంటుంది.

**వ్యాపారి :** "ఏమిటా భిక్ష? అంటే అతని భార్య, నేను కొన్ని జొన్నలు భిక్షగా వేశాను, అంటుంది.

**వ్యాపారి :** "నీవతనికి నీ వజ్రపు ముక్కు పుడక ఇచ్చావు, లేనట్లైతే నీ ముక్కు పుడక చూపించు, అంటాడు.

**భార్య :** "నేను దానిని పూజగదిలో ఉంచాను," అంటుంది.

**వ్యాపారి :** దానిని వెంటనే ఇక్కడకు తీసుకొనిరా, అంటాడు.

**భార్య :** "నేను తులసి మాత పూజ చేసిన వెంటనే నీవడిగిన ఆభరణమును తెస్తాను," అంటుంది.

**వ్యాపారి :** "నీవు ఇప్పుడు మరే దారి లేక తులసి పూజ అనే నెపంతో తప్పించుకోవాలని చూస్తున్నావు," అంటాడు.

భార్యకు చాలా బాధ కలిగి తాను రోజు పూజించే తులసి మాతను రెండు చేతులూ జోడించి, ఈ విధముగా ప్రార్ధించింది, "ఓ మాతా! నన్నీ విపత్తు నుండి కాపాడు. నీవు కనుక నాకు ఇప్పుడు సహాయ పడకపోతే, ఆత్మహత్య చేసుకోవడము తప్ప నాకు వేరే గత్యంతరము లేదు." అంటూ కన్నులు మూసుకొని ఆమె తదేక ధ్యానమగ్నురాలైంది. అప్పుడు అకస్మాత్తుగా "టుక్" అనే శబ్ధము వినవచ్చింది. ఆమె కనులు తెరచి చూస్తే ఆశ్చర్యము! తన నాసికాభరణము తులసి చెట్టు సమీపంలో క్రింద పడి ఉంది. ఆమె దాన్ని తన భర్త వద్దకు తీసుకొని వెళ్ళింది.

**వ్యాపారి:** "ఆహా! ఇది ఇక్కడికి ఎలా వచ్చింది? నేను దీన్ని దుకాణంలో నగల పెట్టెలో పెట్టి తాళము వేసి ఉన్నానే, అనుకొంటూ పరుగున వెళ్ళి తన దుకాణంలో పెట్టెలో పెట్టిన నగ కోసమై వెతికితే, అది అక్కడ లేదు. ఈ సంఘటన ఆ వ్యాపారిలో ఒక్కసారిగా పరివర్తన కలిగించింది. తాను ఎవ్వరినైతే ఆరు నెలలుగా ద్వేషిస్తూ అసహ్యించుకొంటున్నాడో ఆ హరిదాసుకై వెతికితే అతని జాడ తెలియలేదు. వ్యాపారి ఆ హరిదాసుని ఎలాగైనా ఒకసారి చూడాలని ఆత్రుత పడసాగాడు. అతడు కన్నీటిని ఆపుకోలేక బిగ్గరగా ఏడుస్తూ, "ఓ హరిదాసూ! నేను నిన్ను ఎలాగైనా ఒకసారి చూడాలి. నిన్ను చూడకుండా, నేను ఇంకొక్క క్షణము కూడా బ్రతికి ఉండలేను. దయచేసి నా వద్దకు రా." అప్పుడాకాశవాణి ఇలా పలికింది, "నీవు హరిదాసు రూపములోనే నన్నెందుకు చూడాలని అనుకొంటున్నావు? నేను నా స్వస్వరూపముతోనే నీకు దర్శనమిస్తాను." వెంటనే ఒక దివ్య ప్రకాశపు వెలుగు ఆవిర్భవించి, అక్కడ కృష్ణ భగవానుడు ప్రత్యక్షమయి, ఆ పిసినిగొట్టు వ్యాపారికి దర్శన మిచ్చాడు. ఆ వ్యాపారి అప్పటినుండి తన పిసినగొట్టుతనాన్నే కాక, తన వ్యాపారాన్ని వదిలేసి, తన సంపదనంతటినీ పేదలకు పంచి, తన భార్యతో సహా విజయ విఠోబాను సేవించడానికి విజయనగరము వెళ్ళిపోయాడు. అక్కడ అతడు 'పురందరదాస' అను నామముతో ప్రసిద్ధి పొందాడు.

# హ్రీం

వాడ్రేవు శారద

## సృష్టి స్థితి లయ లక్షణాత్మకమైన బీజాక్షరము

స్థైర్యము, ఆత్మ గౌరవములు మానవుని మానసిక ఎదుగుదలకు, అనుభూతులను నడిపించే మానసిక లక్షణాలు, ఈ పరిణామ, సంక్లిష్టమైన ప్రపంచంలో మనం తరచుగా మన వృత్తిలో, ఉద్యోగాలలో ప్రేమలో, బంధుత్వాలను నిలుపుకోవడంలో భంగపాటును చవిచూస్తుంటాము. ఆ భంగపాటు మనల్ని అంతర్గతంగా కృంగదీసి నిస్పృహ, నిస్సహాయతలకు గురిచేస్తుంది. మనం ఎంత ప్రయత్నించినా ఆ కృంగుబాటు, వరుస పరాజయాలు మన చుట్టూ నిరాశావాదాన్ని అల్లి నిరాశావాదం లోనికి లాగివేస్తుంది. నిరాశావాదుల్ని ముందడుగు వేయటానికి ఆసక్తి లేనివారిని ఎవరూ గౌరవించరు. వారితో బంధం పెంచుకోవడానికి ఆసక్తి చూపరు. ఆత్మ గౌరవం లేనివారిని ఎవరూ గౌరవించరు. మన వేదాలలో మనం మరింత ఉత్సాహవంతులుగా ప్రత్యేకమైన వారిగా, ఆత్మ విశ్వాసం కలవారిగా చేయడానికి ఉపయోగపడే మంత్రాలు చాలా వున్నాయి.

మననము చేయుటవలన రక్షించుదానిని మంత్రము అంటారు. ఏ మంత్రానికైనా బీజం మూలం. జీవుడు క్షేత్రం (పొలము) మంత్రం విత్తనం. మంత్ర జపం నీరు (వర్షం) దివ్యమైన అక్షరాలకి శక్తినిచ్చేది బీజాక్షరము. బీజము అంటే మొలక, విత్తనము, మూలము అని అర్ధములు సృష్టి మొదటి నుండి బీజాక్షరములున్నవి. బిందు పూర్వక, బిందు రహిత, రహస్య, అరహస్య, అని బీజాలు నాలుగు రకాలు. ఏడుకోట్ల బీజాక్షరాలు సృష్టిలో వున్నాయి. బీజాక్షరాలతో కూడిన మంత్ర జపం సద్యః ఫలాన్ని యిస్తుంది. పరమేశ్వర సంకల్పంతో ఆవిర్భవించిన పదునాలుగు వ్యాకరణ సూత్రములు నుండి చిన్న చిన్న మార్పులతో కూర్చబడ్డవి బీజాక్షరములు. చాలా పెద్ద ఆకారం గల వృక్షం చిన్న విత్తనంలో దాగివున్నట్లుగ మంత్రము యొక్క విరాట్ శక్తి అంతయూ బీజంలో నిక్షిప్తమై వుంటుంది. శిష్యుని అర్హతను బట్టి గురువు మంత్రోపదేశం చేస్తాడు.

"హ్రీం" అనే బీజాక్షరం మన ఆత్మ గౌరవాన్ని ధీశక్తిని, ప్రభావాన్ని హెచ్చించడానికి సహాయపడుతుంది. ఈ శక్తి సామాన్య మనుష్యులు గుర్తించలేనిది. ఈ బీజాక్షరం అగ్ని, కాంతి, ధర్మముల శక్తిని పెంచుతుంది. ఈ శబ్ద శక్తిలో శివ శక్తుల బలముంది. శివుని అర్ధనారీశ్వర తత్వాన్ని సూచిస్తుంది. మనలోని సౌరశక్తిని, బుద్ధి బలాన్ని, జ్ఞానాన్ని పెంచే శక్తిగా, మన మానసిక, శారీరక, హృదయ స్థైర్యాన్ని పెంచే మన హృదయ స్థానంలో వున్న అనాహత చక్రంగా వెలుగుతుంది. "హ్రీం" బీజాక్షరం విడదీస్తే హ– శివుని శక్తి (లయం) ర–ప్రకృతి, కాంతి, అగ్ని ధర్మం, ఈ – ఆది శక్తి, మ – సృష్టికర్తి. ఈ శబ్దారాధన ద్వారా మనం ఈ ప్రపంచ సృష్టి స్థితిలయ కారకులైన మన చింతలు పారద్రోలి ఆశావహులమయే మార్గానికి నడిపించే శివశక్తులను ప్రార్థించడమన్నమాట.

హ్రి అనే క్రియా పదమునకు కృ ధాతవు కలవగా హ్రీం కారమగును. హ్రీం అనగా తప్పుపనులు చేయుటకు సిగ్గును కలుగజేయునని అని, సృష్ట్యాదులను చేయునది అని,

భువనేశ్వరి బీజస్వరూపమని భాష్యము. హ్రీం అనే అక్షరములో భువనేశ్వరి బీజ స్వరూపురాలని అర్థము. ఇందలి హ కారము సృష్టిని, రేఫము స్థితిని, ఈ కారము లయమును తెలియజేయును. చివర బిందువుపై మూడింటిని అదుపులో వుంచు పరబ్రహ్మస్వరూపము. అకార ఉకార మకారములు ఓంకారమయినట్లుగా, హకార, రేఫ, ఈకార నాదములు హ్రీం అను బీజాక్షరములో వున్నాయి. హకారం ఆకాశతత్వము రకారము (రేఫం) అగ్ని బీజము. అనగా రజోగుణ సంపత్తి గలది. హకార శుద్ధ చైతన్య స్వరూపం రేఫముతో కలిస్తే జగత్ సృష్టి సామర్థ్యం కలిగినదవుతుంది. సృష్టి స్థితిలయ సముదాయములకు హ్రీం అను బీజాక్షరమే కారణము. అనగా త్రిమూర్త్యాత్మకమైన శక్తి సామర్థ్యములు కలది. హకారం ఆకాశతత్త్వ స్వరూపం. కావున హ బీజం కార్య సాధనకు ఉపయోగపడుతుంది. రేఫం రజోగుణముతో కూడిన సృష్టికి చిహ్నం. అగ్నిబీజం ఈ కారం స్థితి హేతువైన విష్ణుతత్వం మన్మథ బీజం అనుస్వారం (ం) లయ హేతువు అనగా హ్రీంలో సృష్టి స్థితి లయ లక్షణాలు మూడు ఉన్నాయి. హ కారం తెలుపు - రేఫము ఎఋపు - ఈ కారం నలుపు రంగులను తెలియజేస్తున్నాయి. ఈ రంగులు సత్త్వ రజస్తమో గుణాలకు గుర్తులు. హ కారమునకు ఆకాశము, సూర్యుడు అని, రేఫము అగ్ని అని, ఈ కారమునకు చంద్రుడు అని కూడ అర్థాలు ఉన్నాయి. హృజ్ - హరణే అనే ధాతువు నుండి హ్రీం శబ్దము పుట్టింది. అనగా సర్వమును హరించునది, సర్వ పాపములను హరించునది, సర్వ దోషములను హరించునది, మోక్షసాధనకు ఆటంకమైన అజ్ఞానమును పోగొట్టు శక్తి కలది, సమస్త ఐశ్వర్యములకు మూలమైన పరమానంద స్వరూపమై ముక్తి నిచ్చునది. హ్రీంకార బీజాక్షరానికి వేదాలు అని అర్థం. ఇందులోని హకార రేఫలు విశ్వతత్వాన్ని తెలియజేస్తే, నాదరూపమైన ఈమ్ విశ్వకారణాన్ని తెలియజేస్తుంది. జాగ్రత్ - స్వప్న సుషుప్తి అను మూడు అవస్థలను సూచిస్తుంది. సత్ - చిత్ - ఆనందము అను మూడు తత్త్వాలు కలిపిన రూపమే హ్రీంకారము.

హ్రీంకారమనే ఏకాక్షర శబ్దము బీజ మంత్రముగా తెలియబడుతుంది. భువనేశ్వరీ దేవి యొక్క బీజమంత్రము ఈ దేవత పార్వతీ దేవి యొక్క బీజాలలో ఒకటి. ఈ బీజాక్షర సాధకుడు శివశక్తుల శక్తిని పొందుతాడు. ఈ పవిత్ర బీజమననం ధ్యానానికి మనస్సును సిద్ధపరుస్తుంది. ధ్యాన యోగము చక్కగా కుదురుటకు హ్రీం అక్షర త్రయమును మొదట చక్కగా భావించాలి. ఇది దేవీ ప్రణవ స్వరూపమైనది. మాయా మంత్ర బీజము మంత్రరాజము అక్షర త్రయములోని హకారము స్థూల దేహము. మంత్ర రాజము అక్షర త్రయములోని హ కారము స్థూలదేహము, రేఫము సూక్ష్మ దేహము ఈ కారము కారణదేహము. హ్రీం కారము తురీయాత్మ - నేనే. సాధకుడు నిశ్చలమైన పరాభక్తితో హృదయగుహలో చిత్తము నిలిపి, నలయమొనరింపవలెను. పిదప సూక్ష్మాత్మయగు రేఫమును కారణాత్మయగు ఈకారమును సర్వాత్మకమైన హ్రీంకారము నందు లయ మొనర్చవలెను. పిదప చిదగ్ని శిఖలో వాక్య వాచకత్వములును ద్వైతములును లేనట్టి పరబ్రహ్మ రసమయమగు అఖండ సచ్చిదానందమును ధ్యానింపవలయును. ఈ ధ్యానము వలన సాధకుడు దేవీ సారూప్యమును పొందగలడు. అన్ని బీజాక్షరముల యొక్క మంత్రాధిష్ఠాన దేవతలకు హ్రీంకార దేవతయే ప్రధానమయినది.

హ్రీంకారోపాసన చతుర్విధ పురుషార్థాలను అనుగ్రహిస్తుంది. హ్రీంకార బీజాక్షర ధ్యానం మనలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. ధైర్యాన్ని నమ్మకాన్ని వృద్ధిచేసి పోయిన మనో

దారుఢ్యాన్ని తిరిగి తెస్తుంది. ఉపాసకులకు అజ్ఞానమనే చీకటి తొలగి స్వస్వరూప జ్ఞానం కలుగుతుంది. మనకు పెద్దలు, అధికారుల యెడల గల అక్కరలేని భయాన్ని పోగొడుతుంది. మెదడులోని నరాలను రక్త ప్రసరణాన్ని ఉత్తేజపరచి శారీరక, మానసిక శక్తినిస్తుంది. అనాహత చక్రాన్ని నియంత్రించి గుండె జబ్బులను తొలగిస్తుంది. ఒక సమ్మోహన శక్తిగా మారి సాధకునికి అందరినీ ఆకర్షించే వ్యక్తిత్వం కలిగించి, సమూహంలో కేంద్ర బిందువుగా నిలబెడుతుంది. లౌకిక జీవనం గడుపుతున్నా, మనం దానికి అంటకుండా ఉండేలా సహాయం చేస్తుంది. భ్రమలను తొలగించి మోక్షాన్ని పొందేలా సహకరిస్తుంది. పిత్తవాత దోషాలను నివారిస్తుంది. దీనిలోని సౌరశక్తి ఉపాసకుని సూర్యునిలా ప్రకాశింపజేస్తుంది. శివశక్తుల బలం కలిగి వుండడం వలన సృష్టి లయములను చేసే శక్తి కలిగి వుంటుంది. తేజస్సు, ఆత్మ విశ్వాసాన్ని కలిగించి మనలోని అహమును తొలగించి వినయమును కృతజ్ఞతను మనలో నింపుతోంది.

ఇతర బీజాక్షరముల కంటే హ్రీం బీజము పరదేవత యొక్క ముఖ్యమైన స్థానము. హ్రీంకార బీజోపాసన చేసిన వారిని పరదేవత ఎల్లవేళలా రక్షిస్తూ వుంటుంది. హ్రీంకారానికి ఓంకారానికి భేదం లేదు. అందుకనే అమ్మవారిని "ఓంకార పంజర శుకీం" అని శంకరులు స్తుతించారు. దేవదేవులు తమ త్రిశతిలో "హ్రీంకార పంజక శుకీం" అని అన్నారు.

ఆత్మ చీకటి వెలుగులు లేని స్వయం ప్రకాశకత్వమును కలిగియుండును. అది తనకు తానుగా వ్యక్తమమయ్యేడి పరిపూర్ణసత్యము. అందువలన దానిని గురించి అది ఇట్లుండును, అట్లుండును అని ఆలోచించరాదు. ఆ ఆలోచనలే బంధమును కలుగజేయును. ఆత్మపై ధ్యానము సల్పుటలో ఉద్దేశము, మనసు ఆత్మరూపమును పొందునట్లు చేయుటయే. హృదయ కుహరము మధ్యన శుద్ధ బ్రహ్మము "నేను – నేను" అనెడి రూపములో ప్రత్యక్షముగా వ్యక్తమైనది. దానిని పైన చెప్పిన విధముగా తెలుసుకొనకుండా దానిని గురించి అనేక విధములుగా ఆలోచించుట కన్న అజ్ఞానము ఉండునా?

**– భగవాన్ రమణ మహర్షి**

పరులకు మంచిది గావించుటే పుణ్యము (ధర్మము), పరులకు హాని కలిగించుటే పాపము. బలము, పౌరుషము, పుణ్యము, బలహీనత, పిరికితనము పాపము. తన కాళ్ళపై తాను నిలబడి స్వతంత్రముగా మనుగడసాగించుట పుణ్యము, ఇతరులపై ఆధారపడి జీవించుట పాపము. ఇతరులను ప్రేమించుట పుణ్యము, ద్వేషించుట పాపము. భగవంతుని యందు, తన ఆత్మయందు గల నమ్మకమే పుణ్యము, సందేహమే పాపము. ఏకత్వమును గురించిన జ్ఞానమే పుణ్యము, భిన్నత్వమును చూచుటే పాపము.

**– వివేకానంద స్వామి**

# జగజ్జనని

**జాతీయ సౌభాగ్యపు చిహ్నములు** **– శ్రీ స్వామి చిదానంద**

## సర్వవృత్తులలోని నైపుణ్యమే సౌభాగ్యము

లక్ష్మీదేవిని తెలుసుకోవడం చాలా ఉపయోగకరమైన విషయం, అప్పుడే ఈ జీవితం సుఖసౌభాగ్యాలతో గడిపేందుకు వీలవుతుంది. మానవుని సాంఘిక జాతీయ జీవిత దృక్పథాలలో ఈ ద్వివిధాలుగా తల్లి ప్రసన్నమై దుర్గాదేవి స్వరూపంలో తన భయంకర దివ్య శక్తుల్నే ఎదుర్కొని సమస్థాయిని కల్పిస్తుంది. ఈ పుడమిపై జీవితాన్ని పోషించేందుకు దుష్ట సంహారం ఎలా చేస్తుందో మనం అర్థం చేసుకున్నాం. ఆమె జీవితాన్ని ఖండ ఖండాలుగా వివిధ స్వరూపాలుగా రూప కల్పన చెయ్యక పోతే ఈ పుడమిపై జీవితం యావత్తు అల్లకల్లోలంగా విధ్వంసకంగా, దుర్భరంగా అంతమయ్యేది. జీవితాన్ని పోషించేందుకు దుర్గామాత యుద్ధాల్ని, అంటు వ్యాధుల్ని కరువు కాటకాల్ని, వరదల్ని, అగ్ని ప్రమాదాల్ని భూకంపాల్ని ఎలా కల్పిస్తుందో మనం తెలుసుకున్నాం. లక్ష్మీ దేవి ఈ జీవితంలో ఇంకొక స్వరూపం దాలుస్తుంది. దుర్గగా భయానక స్వరూపం దాల్చినా. లక్ష్మిగా తత్స్వ రూపానికి వ్యతిరేక మైన స్వరూపం దాలుస్తుంది. యథార్థానికి వ్యతిరేకంగా శాంతిదూత గాను, సమృద్ధముగాను, సారవంతమైన నిండు పంటగాను, రూపాలు దాలుస్తుంది. ఇంకా రోగాలు, అంటువ్యాధులకు బదులు సంఘ శ్రేయస్సుగాను, ప్రజారోగ్యంగాను, బాలబాలికల ఆరోగ్యంగాను సంఘంలో అవతరిస్తుంది. లక్ష్మీ ప్రసన్నమైతే విశ్వశాంతి, లోక కళ్యాణం చేకూరుతాయి. ఆరోగ్యశాఖ, ఔషధాలయాలు, అగ్ని మాపకదళాలు, రక్షణ శాఖ మొదలైనవి లక్ష్మీ దేవి యొక్క రక్షణశక్తులు . విష్ణుశక్తే లక్ష్మీ దేవిగా అవతరించి ప్రకృతియొక్క క్లేశాలను ఎదుర్కొని మానవాళి యొక్క శ్రేయస్సుని, సౌభాగ్యాన్ని కాపాడుతుంది. అందుచేత రాజకీయ వేత్తలకు, పరిపాలకులు, సంఘ నాయకులకు, ఈ వివిధ తీరులూ మానవసమాజంలో లక్ష్మీ స్వరూపాలయొక్క చిహ్నములే, ఈ విషయాలు మరుగుపడేచోట మన సౌఖ్యం అడుగంటుతుంది. ప్రజల ఊర్ధ్వ గమనం కుంటుపడుతుంది. ఆ దేశం, ఆ సంఘం యొక్క అభ్యున్నతి దెబ్బ తింటుంది. అందుచేత ప్రాచీన న్యాయశాస్త్ర వేత్తలు ప్రతి నిజమైన పరిపాలకులకులకు జగన్మాతయొక్క ఈ ముఖ్యాంశములను గుర్తుంచుకోవలసిందని అతడెల్లప్పుడు అత్యంత శ్రద్ధతో ఈ ఉదాత్తాంశములు సంఘంలో దినదినాభివృద్ధి చెందునట్లు కృషి చేయవలెనని నిర్దేశించారు. ఈ అంశముల ద్వారానే జగన్మాత లక్ష్మీ స్వరూపంలో వ్యక్తమై విష్ణుశక్తిని పెంపొందింపజేస్తుంది. దేవతామందిరాలు, బడులు, ఆట స్థలాలు, పార్కులు, ఉద్యావనవనములు, సరస్సులు, మొదలైనవన్నీ మానవసంఘంలో

విష్ణుశక్తి స్వరూపాలే, లక్ష్మీ స్వరూపాలే. అందుచేత ధర్మాన్ని చేపట్టిన భారత వర్షంలో మందిరంలేని స్థలమే లేదు. అదొక చిన్న గ్రామం కావచ్చు. పల్లెకావచ్చు. వాడకావొచ్చు. ఐనప్పటికీ, ఒక చక్కని కట్టడం లేకపోకయినప్పటికీ, ఒక చిన్న చెట్టు నీడను ఆ గ్రామ దేవత అచ్చటి సంఘ వ్యక్తుల చేత పూజింపబడుతుంది. ఎక్కడైతే పూజా స్థలం లేని గ్రామం ఉంటుందో అక్కడికి మహర్షులుగాని, భక్తులుగాని పోరు. "ఈ స్థలంలో లక్ష్మీ లేదు" అని వారంటారు. అట్టి స్థలానికి వారు దూరమవుతారు. ఎక్కడ జనులకు గాని, గోవులు గాని త్రాగేందుకు మంచినీరు లేదో, అట్టే స్థలంలో లక్ష్మీ దేవి లేదని పెద్దలు చెబుతారు. సాధు సజ్జనులు అట్టి స్థలం నుండి వెళ్ళిపోతారు.

ధార్మికులందరూ ఐశ్వర్యవంతులందరూ, భగవత్ప్రసాదమైన ఐశ్వర్యాన్ని ప్రజల సౌకర్యాల కోసం సద్వినియోగపరుస్తారు. చెట్లు నాటడం బావులు సరస్సులు త్రవ్వించడం, మందిరాలు లేని చోట్ల మందిరాలు నిర్మించడం, పాడుబడిన దేవాలయములను పునర్నిర్మాణము చేయడం, బాటసారుల నిమిత్తం సత్రములు నిర్మించడం, యాత్రీకులకు, పుణ్య పురుషులకు సాధు సజ్జనులకు అన్న క్షేత్రాలు నిర్మించడం – ఇవన్నీ ధర్మకార్యాలుగా పుణ్య కార్యాలుగా ఎప్పుడూ పరిగణింపబడుతూనే వచ్చాయి. ఇప్పుడూ పరిగణించబడుతూనే ఉన్నాయి. అట్టి దాతలకు శాశ్వత సౌఖ్యం తప్పక లభిస్తుంది. విద్యకూడా ఒక లక్ష్మీ స్వరూపమే, అష్టలక్ష్ములలో ఈ అంశము విద్యాలక్ష్మిగా పరిగణింపబడుతుంది. ఈ విధంగా లక్ష్మీ దేవియొక్క వ్యక్త స్వరూపాలు ప్రతి మనుజుడు, ప్రతి పౌరుడు, దేశంలోను సంఘంలోను పెంపొందించాలని న్యాయ శాస్త్రవేత్తలు వాంఛిస్తూ వచ్చారు. అప్పుడే దేశానికి సుస్థిర సౌభాగ్యం లభిస్తుంది.

అసూయ – అసూయ అనునదొక మానసిక కుష్ఠ రోగము. కుష్ఠరోగము శరీరమును పాడుచేయును. అసూయ మనస్సునే నశింపచేయును. భయంకరమైన కుష్ఠ వ్యాధి కన్నను అసూయ మిక్కిలి అపాయకరము. కుష్ఠవ్యాధి పీడితుండయ్యు మానవుడు ఆధ్యాత్మిక బుద్ధితో నుండవచ్చును. అసూయకు లోబడినవాడు పారమార్థిక బుద్ధితో నుండుట దుర్ఘటము (కష్ట సాధ్యము) అసూయపరులు జుగుప్సచే తాము దుఃఖభాజనులగుటయే గాక తమ చుట్టును గలవారికి కూడా సంతాపము కలిగింతురు. ఈ మానసిక కుష్ఠవ్యాధికి కారణమేమి? మౌఢ్యమే దీనికి మూలము.

**– స్వామి ఓంకార్**

# శాంతి నివాసం

ఆ ఆశ్రమంలో
చివరంటూ
ఓ
ఇల్లు ఉంది
అమ్మ పాపిడిలా
రెండు
కాలువ గట్టుల మధ్య
అటు ఇటు
పచ్చటి పొలాల మధ్య
ఒక అందమైన
వాలుజడ లాంటి
బాట ఉంటుంది
ఆ బాటంట
నడుచుకొంటూ
పోతుంటే
మామిడితోటలు
పువ్వుల తోటలు
ఆహ్వానిస్తాయి
ముచ్చటగా
ముచ్చటిస్తాయి
ఎన్నో కబుర్లు
చెపుతాయి
మనల్ని ఆడిస్తాయి
పాడిస్తాయి
మనల్ని మనం
మరిచిపోతాం
చవరకు
ఆ ఇల్లు వస్తుంది
అమ్మ
ప్రత్యక్షమవుతుంది
ఆ అమ్మ
తెల్లటి వస్త్రాలతో
సూర్యోదయంలా
ఉంటుంది
అమ్మకనులు
చంద్రోదయంలా
ఉంటాయి
అమ్మ మాటలు
పువ్వుల రేకలులా
ఉంటాయి
అమ్మ నవ్వులు
మంచు బిందువులులా
ఉంటాయి
అమ్మకు
పాదాభివందనం చేస్తే
ధరిత్రి ఉప్పొంగి పోతుంది
అమ్మ
ఆశీర్వదిస్తే
అమ్మ స్పర్శ తాకితే
సర్వం
వెన్నెల కాంతులతో
పులకించిపోతాం
ఆ ఇల్లే
శాంతి ఆశ్రమంలో
మాతాజీ
శాంతి నివాసం

**ఎమ్.ఎస్. రంగారావు (బన్ను)**

# శ్రీ తులసీ సర్వస్వము

జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యశర్మ

## తులసీ దళము నిత్య పవిత్రమైనది

### తులసి యొక్క ప్రాశస్త్యము

తులసి దేవతగా వృక్షరాజముగా, మహౌషధముగా పూజోపకరణముగా, కీటకనాశినిగా, మహా ప్రసాదజననిగా, శుభప్రదాయినిగా ఎన్నో విధముల మానవజాతికి ఉపకరించుచు తన ప్రాశస్త్యమును చాటుచున్నది.

### తులసి యొక్క శ్రేష్ఠత

శ్లో॥ సర్వౌషధీ రసేనైవ పురా హ్యమృతమంథనే ।
సర్వసత్త్వోపకారాయ విష్ణునా తులసీకృతా ॥

తా॥ పూర్వ కాలమున అమృతమునకై దేవతలు, రాక్షసులు, పాల సముద్రమును చిలికినప్పుడు సర్వ ఔషధీరసములను కలిపి, శ్రీ మహావిష్ణువు సర్వ సత్వములకు ఉపకారము చేయుటకై తులసిని సృష్టించెను.

శ్లో॥ న విప్రసదృశం పాత్రం, న దానం సురభేః సమమ్ ।
న చ గంగాసమం తీర్థం, న పత్రం తులసీసమమ్ ॥

తా॥ దానమును అందుకొనుటకు అర్హులైనవారిలో బ్రాహ్మణునితో సమానుడైన వాడు సర్వలోకములయందు ఎచ్చటను కానరాడు. గోదానము చేయువాడు కామధేనువున కన్న మిన్నయగు దానిని దానమీయలేడు. గంగతో సమానమైన పవిత్రతకల తీర్థము ఇంకొకటి ఎచ్చటను దొరకదు. అట్లే తులసీ పత్రముతో సమానమగు పవిత్రత గల ఆకు మరొకటి ఎచ్చటను కానరాదు.

### తులసి సదా పవిత్రమైనది (స్కాంద పురాణము)

తులసికి పాసిపోవుట, ఎండిపోవుట, అపవిత్రమగుట అను గుణములు ఎన్నడు ఉండవు. అపవిత్రమైన స్థలములలో పడినను దానిని తీసి కడిగి దేవతల పూజలలో ఉపయోగించవచ్చును. ఒక్క తులసి తప్ప తక్కిన అన్ని వస్తువులకు ఇంతటి పవిత్రత ఎచ్చటను, ఎన్నడును ఉండదు. ఈ విషయమునే స్కాంద పురాణము ఇట్లు పేర్కొనినది.

**శ్లో॥ వర్జ్యం పర్యుషితం పుష్పం, వర్జ్యం పర్యుషితం జలమ్।**
**న వర్జ్యం తులసీపత్రం, న వర్జ్యం జాహ్నవీజలమ్ ॥** (స్కాంద పురాణము 8–9)

తా॥ ఎండిన పువ్వును, పూజా విషయములలో ఉపయోగింపరాదు. అట్లే అపవిత్ర స్థలమునందు పడిన పుష్పము, నిన్న కోయబడిన పుష్పము దైవపూజకు పనికిరావు. కాని ఎప్పుడు కోసినను, తులసి ఎండినను, పాతదైనను పూజకు వాడవచ్చును. అట్లే

గంగాజలమునకు కూడ కాలదోషము ఉండక ఎప్పుడు పరిశుద్ధముగనే ఉండును. కనుక ఆ గంగాజలమును ఎప్పుడైనను పూజలలో ఉపయోగించుకొనవచ్చును. కాని ఇతర జలములు, ఒక రోజు క్రిందట పట్టి ఉంచిన వానిని పూజలలో ఉపయోగింపరాదు. తులసికి అంటు, పాచి అను దోషము లుండవు.

శ్లో॥ త్రిరాత్రం తులసీ పత్రం శుద్ధం పర్యుషితమ్ సతి ।
శ్రాద్ధే, వ్రతేచ, దానేచ, ప్రతిష్ఠాయాం సురార్చనే ॥
భూగతం తోయపతితం, యద్ధృతం విష్ణవేప్రతి ।
శుద్ధంచ తులసీ పత్రం క్షాళనా దన్య కర్మణే ॥

తా॥ తులసీదళము యొక్క నిత్య పావనత్వము ఇట్లు చెప్పబడినది. శ్రార్ధములు, వ్రతములు, ధానములు, దేవతాప్రతిష్ఠలు, దేవపూజలు మొదలగు వానిని నిర్వర్తింపవలసినప్పుడు మూడు రాత్రుల క్రింద కోయబడిన పాచిదైన తులసీదళము కూడ పవిత్రమైనదే అగును. తులసికి పాచి పట్టుట అను దోషము ఉండదు. అంతేకాదు, తులసి ఆకు నేలపై పడినను, నీటిలో పడినను, దానిని బాగుగా కడిగి, మరల విష్ణువునకు సమర్పింప వచ్చును. నేల పై పడిన ఏ ఇతర పదార్థమును భగవదర్పణకు యోగ్యము కాదు. కాని తులసీ దళము నిత్య పవిత్రమైనది కనుక భగవదర్పణకు యోగ్యమైనదే అగును. తులసి యొక్క నిత్య పవిత్రతకు మరికొన్ని కారణములు ఇట్లు పేర్కొనబడినవి.

పురాణము ఇట్లు పేర్కొనినది.

శ్లో॥ వృక్షాధిష్ఠాతృదేవీ యా, గోలోకేచ నిరామయే।
కృష్ణేనసార్ధం, నిత్యం చ నిత్యక్రీడాం కరిష్యసి॥

తా॥ తులసీ వృక్షము గోలోక కృష్ణునితో నిత్య సంబంధము కలది కనుక అది నిత్య పవిత్రురాలు అయినది. "ఓ వృక్షాధిష్ఠాతృదేవీ" (వృక్షమును అధిష్ఠించియున్న దేవత) గోలోకములో కూడ ఎట్టి ఆమయములు (ఇబ్బందులు) లేనిదానా! కృష్ణునితో కూడి గోలోకమునందు నిత్యము నిత్య క్రీడ చేయుదానా! అని తులసిని ప్రార్థించుటచే ఆమె నిత్య పవిత్రురాలు అనుట నిశ్చయమయినది.

## లోకములో ప్రచారములో నున్న ఒక విషయము

బృంద శంఖచూడుని వివాహ మాడక ముందు కన్యగా ఉండెడిది కదా! అతని మరణానంతర మామె విధవయైనది. వృక్షరూపమును ధరించినదని కూడ మన మింతకు పూర్వము తెలిసికొంటిమి కదా! వృక్షము నందు 1. కాండము, 2. వెన్ను లేక పువ్వు అని రెండు భాగములుండుట మన కందఱకును తెలిసిన విషయమే. బృంద తులసి వృక్షముగా మారిన తరువాత ఆ వృక్షము నందలి కాండమును వెన్నును గూర్చి ఇట్లనుకొనుట పరిపాటియైనది. "వెన్ను విధవ కాండం కన్య" అని శంఖచూడ మరణానంతరము వృక్షముగా మారనంత కాలము ఆమె కన్య, భర్తృమరణానంతరము ఆమె విధవమైనది కదా! వృక్షముగా మారిన తరువాత కాండము కన్యావస్థను సూచింపగా, వెన్ను విధవాస్థను సూచించినదట!

# విజ్ఞప్తి - గోసంతతికై గోశాల విస్తరణ

**నమోదేవ్యై మహాదేవ్యై సురభ్యై చ నమో నమః । గవాం బీజ స్వరూపాయై నమస్తే జగదంబికే॥**
**మహాదేవీ, గోబీజ స్వరూపిణి, జగదంబికా । సురభిమాతా, నీకు నమస్కరించు చున్నాను.**

ప్రేమమూర్తులైన, ఆశ్రమ భక్తులకు పూజ్య స్వామి ఓంకార్ మరియు మాతాజీ వారి యొక్క దివ్య ఆశీస్సులు.

మీ అందరి సహకార సంపత్తులతో, ఆశ్రమంలో తలపెట్టిన బృహత్ పథకం అయిన "గోశాల మరియు కృష్ణమందిరం నిర్మాణం", విజయవంతంగా పూర్తి అయ్యి మార్చి నెలలో పూజ్య మాతాజీ దివ్య హస్తములతో ఘనంగా ప్రారంభమయిన విషయం మీ అందరికీ ఇదివరలో పత్రికా ముఖంగా తెలియపరచడమైనది.

ఈ గోశాల నిర్మాణం వలన గోవులు, లేగదూడలు ఎంతో సౌకర్యంగా, ఆరోగ్యకరంగా ఉంటున్నాయని తెలుపుటకు చాలా ఆనందంగా వుంది. ఇందుకు గాను సహకరించిన సహృదయులు అయిన భక్తులు అందరికీ మరొక్కసారి కృతజ్ఞతలు మరియు ఆశీస్సులు.

గత సంవత్సర కాలంగా సంఖ్యాపరంగా పెరిగిన లేగదూడలు ఉండుటకు, సేద తీరి పచ్చిక మేయుటకు, వాటికి ప్రత్యేకంగా, కొంత విశాల ఆవరణతో కూడిన చిన్న షెడ్ నిర్మాణం అవశ్యం అనిపించింది.

ఈ ప్రతిపాదనలో, 100' × 50' అడుగుల కొలతలు గలిగి, ప్రహారి గోడ, గేటుతో కూడిన ఒక విశాల ఆవరణ, అందులో 20'×40' సైజు గల, ఒక రేకుల షెడ్ మరియు చిన్న నీటి తొట్టి నిర్మించాలని తలపెట్టడం అయ్యింది.

ఈ ప్రతిపాదనకు సుమారుగా రూ.6.50 లక్షలు కాగలదని అంచనా వేయడం అయ్యింది.

ఈ బృహత్కర నిర్మాణంలో భాగస్వాములు కాదలచిన ఆశ్రమ భక్తులు, ఔత్సాహిక ఆశ్రమ భక్తులు, ఔత్సాహిక దాతలు విరాళములు ధనరూపంలో/చెక్కు/ ఎస్.బి.ఐ. కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435కు ఆన్‌లైన్ ద్వారా శ్రీ శాంతి ఆశ్రమం పేరున పంపగలరని విజ్ఞప్తి. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకముగా లేదా ఇమెయిల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు. మీ విరాళములకు సెక్షన్ 80జి ప్రకారము ఆదాయపు పన్ను మినహాయింపు కలదు. రూ. 10,000/-కు పైన ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకము మీద వ్రాయబడును. ఈ బృహత్తర కార్యక్రమంలో వారి వారి శక్త్యానుసారము సహకరించవలసినదిగా మా విన్నపము.

ఓం తత్ సత్

గురుసేవలో
**వినమ్రానంద సరస్వతి**

# దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ, కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435కు ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా లేదా మొబైల్ నంబరు 7382009962కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

# శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ. 100/-, జీవిత చందా రూ. 1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం. 11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)

వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

# విన్నపము

విదేశములలో వుండు ఆశ్రమ భక్తులు విరాళములు ఈ క్రింది ఎఫ్.సి.ఆర్.ఎ (Foreign Contributions Regulation Act) బ్యాంక్ అకౌంట్‌కు తమ యొక్క నివసించే ప్రాంతములోని తమ బ్యాంక్ అకౌంట్ నుండి ఆదేశ కరెన్సీలో పంపగలరు. పంపిన పిదప వివరములు srisanthiashram@gmail.com అనే మెయిల్ ఐడికి మరియు mattavvs07@gmail.com కి తప్పకుండా పంపవలెను.

బ్యాంకు పేరు : State Bank of India, 11 Sansad Marg, New Delhi-110001
A/c Name : THE MISSION OF PEACE - FCRA A/c No : 40127798428
Swift Code : SBININBB104

**1. మాతృ ఆశ్రమం**
శ్రీ శాంతి ఆశ్రమము
తోటపల్లి కొండలు, పిన్ : 533 446.
వయా శంఖవరం, తూ.గో.జిల్లా.
సెల్ : 7382009962
రిసెప్షన్ : 6305349677
e-mail:srisanthiashram@gmail.com

**2. విశాఖ : శాంతి ఆశ్రమము**
లాసన్స్‌బే, పెదవాల్తేరు – 530 017
విశాఖపట్నం.
ఫోన్ : 0891 – 2538689
e-mail : srisanthiashramvsp@gmail.com

**3. విశ్వశాంతి క్షేత్రం**
కైలాసగిరి, విశాఖపట్నం

**4. కోటగిరి శాఖ**
పీస్ సెంటర్, డార్‌మోనా రోడ్,
కోటగిరి – 643217, నిలగిరి జిల్లా.
తమిళనాడు.
ఫోన్ : 04266–271945
e-mail : vsvmsktg@yahoo.com
vsvmsktg@gmail.com

**5. కాకినాడ శాఖ**
శాంతి ఆశ్రమము, అశోక్ నగర్
కాకినాడ – 533 004.
తూ.గో.జిల్లా

**6. పిఠాపురం శాఖ**
స్టువర్టు పేట,
పిఠాపురం–533 450. తూ.గో.జిల్లా.

**Website : www.srisantiashram.org**

## దైవ సాయుజ్యము - స్మృత్యంజలి

**ది. 30-8-2021 శ్రీమతి సూర్యకుమారి (విజయవాడ)** శ్రీ భిక్షుమయ్య గురూజీ (ధ్యానమండలి) ధర్మపత్ని అయిన వీరు శ్రీకృష్ణాష్టమి పర్వదినాన అనాయాస మరణం పొందారు. వీరు అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తుండేవారు. మాతృ ఆశ్రమానికి సుపరిచితులు. వీరు భౌతికంగా లేకపోవడం ధ్యానమండలి సంస్థకు తీరనిలోటు. ధ్యాన మందలి సంస్థవారు ఈ లోటునుండి అనతి కాలంలోనే తేరుకోగలరని ఆశిస్తున్నాము. ఓంకార్ స్వామీజీ మరియు జ్ఞానేశ్వరి మాతాజీల ఆధ్యాత్మిక చేయూత వీరి వెన్నంటి వుండగలదని భావిస్తున్నాము.

## కార్యక్రమములు - మాతృ ఆశ్రమం

**తేది 02-10-2021 (శనివారం)** మహాత్మాగాంధీజీ జయంతి

**తేది 06-10-2021 (బుధవారం)** మహాలయ అమావాస్య సందర్భంగా ఉ॥ 7.30 గ॥లకు దుర్గా అష్టోత్తర శతనామార్చన (అన్నపూర్ణ సదన్)

**తేది 20-10-2021 (బుధవారం)** వాల్మీకి జయంతి

# శరన్నవరాత్రులు - మాతృ ఆశ్రమం

తేది 07-10-2021 (గురువారం) 15-10-2021 (శుక్రవారం)

పూజ్యశ్రీ ఓంకార స్వామీజీ వారి దివ్యాశీస్సులతో పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి ఆధ్వర్యంలో శ్రీ గణేష్ ఆచార్య, శ్రీ గంగరాజు మాస్టారు గారిచే నిర్వహించబడును.

తేది 07-10-2021 - 09-10-2021 ఉదయం కలశ స్థాపన శ్రీ వినాయక పూజ శ్రీ దుర్గ అష్టోత్తర శతనామార్చన

తేది : 10-10-2021 - 12-10-2021 : ఉ॥ 7.30 గం॥లకు సా॥ 6.00 గం॥లకు శ్రీ లక్ష్మి అష్టోత్తర శతనామార్చన

తేది : 13-10-2021 - 14-10-2021 : ఉ॥ 7.30 గం॥లకు - సా॥ 6.00 గం॥లకు శ్రీ సరస్వతి అష్టోత్తర శతనామార్చన

తేది 15-10-2021 : విజయదశమి సందర్భంగా ఉ॥ 7.30 గం॥లకు శ్రీ దేవి అష్టోత్తర శతనామార్చన సా॥ 6.00 లకు శమీపూజ

అగ్గిపుడక తడిసి నెమ్ముకొనినప్పుడెంత గీసినను వెలుగదు. అందలి మందు నలుసులుగా నూడిపోవును. నెమ్ముకొనక పొడిగా నుండు పుడకను కొంచెము రాయగనే బుస్సున నంటుకొనును. నిష్కపటమై. సరళమై, స్వచ్ఛమై, విషయ వాంఛలచే మలినముకాని హృదయము పొడి యగ్గిపుల్ల వంటిది. అట్టివారల కొక్కసారి ఉపదేశము చేసినంతనే వారల హృదయమునందు ఈశ్వరానురాగము ఉదయించును. కాని, ధన కామములలో నానిన ఐహికరతుని మనస్సు చెమ్మగిల్లిన నిప్పుపుల్ల. అట్టి వానికి భగవంతుని గురించి నూరుసారులు ఉపదేశించినను భక్త్యగ్ని రగులనేరదు.

**- శ్రీరామకృష్ణ పరమహంస**

ఆత్మశుద్ధి కలిగినదా లేదా! అని తెలిసికొనుటకు మంచి యుపాయమొకటి గలదు. ఆత్మశుద్ధియనియు, హృదయ శుద్ధి యనియు, చిత్తశుద్ధి యనియు మొదలగు వాక్యములు ఒకటియే యగును. సానుకూలమగు సుక్షేత్రములో వేసిన విత్తనమేలాగున శుద్ధముగా పెరిగి మంచి ఫలమునిచ్చునో, అలాగున తాను సంకల్పించిన సంకల్పము గాని, ప్రారంభించిన పనిగాని, ఏ విఘ్నము గలుగక సాగుచుండిన హృదయ శుద్ధి గలిగినట్లు నిశ్చయించుకొనవచ్చును. అట్లు గాక వూషర క్షేత్రములో వేసిన విత్తనమునకు యెంత పోషణ చేసినను చక్కగా పెరిగి ఫలించనట్లు హృదయ శుద్ధి లేనివారు యేది సంకల్పించినను, యేవి ప్రారంభించినను, యెన్ని ప్రయత్నములు చేసినను చక్కగ జరుగక యుండిన చిత్త శుద్ధి గలుగలేనిదని నిశ్చయించుకొనవచ్చును. ఇదే దాని గురుతు.

**- శ్రీ సద్గురు మలయాళ స్వామి**

# శాశ్వత అన్నదానం

1. శ్రీ కొండు మహంతి వెంకటేశ్వరరావు గారు (రాజమండ్రి) 5000/-
వీరి తల్లిగారు కీ॥శే॥ శ్రీమతి సీతామహాలక్ష్మి గారి వర్ధంతి సందర్భంగా
2. శ్రీమతి రుద్రరాజు భార్గవి గారు (హైదరాబాదు) 5000/-
వీరి భర్తగారు కీ॥శే॥ శ్రీ ఆర్. నారాయణ రాజు ఆత్మశాంతి కోరుతూ...
3. శ్రీ ద్వారాపూడి వెంకటరెడ్డి గారు (కాకినాడ) వీరి తల్లిదండ్రులు 5000/-
కీ॥శే॥ శ్రీమతి లీలాదేవి గారు డి. రామకృష్ణా రెడ్డి గార్ల ఆత్మశాంతి కోరుతూ...
4. శ్రీ చింతలపాటి జగపతి వెంకట సుబ్బరాజు గారు (భీమవరం) 10,000/-
వీరి పుట్టినరోజు సందర్భముగా
5. శ్రీ రవి గుప్తా గారు (హైదరాబాద్) వీరి పుట్టినరోజు సందర్భముగా 20,000/-
6. శ్రీమతి కొర్లేపర శాంతి గారు (కాకినాడ) 5000/-
కీ॥శే॥ శ్రీమతి దాసరి పద్మగారి ఆత్మ శాంతి కోరుతూ 25000/-
7. శ్రీ పోతుకూచి భాస్కరావు గారు (బెంగుళూరు)
వీరి ఆరోగ్యము కోరుతూ 30,000/-
8. శ్రీమతి కొర్లేపర శాంతి గారు (కాకినాడ) 5,00,000/-
శ్రీమతి దాసరి పద్మ గారి పుట్టినరోజు సందర్భముగా

## విరాళములు

1. శ్రీమతి పి. అమ్మాజి గారు (హైదరాబాదు) 1300/-
కేరాఫ్ శ్రీ పి. సాయిబాబా గారు గోసంరక్షణ నిమిత్తం
2. శ్రీమతి పి. అమ్మాజీ గారు (హైదరాబాదు) కేరాఫ్ శ్రీ పి. సాయిబాబాగారు 5000/-
విద్యా ఖర్చులు కీ॥శే॥ ముత్యాలసుబ్బారాయుడు గారి జ్ఞాపకార్థం
3. శ్రీ బోళ్ళపాటి నెహ్రూ గారు (కడియపులం) 1000/-
4. శ్రీమతి దాసరి శేషారత్నం గారు (శాంతి ఆశ్రమం) 1000/-
పూజ్య శివానంద మహారాజ్ గారి పుట్టినరోజు సందర్భముగా
5. శ్రీమతి బలిజేపల్లి సుబ్బలక్ష్మి గారు (అమలాపురం) 2000/-
వీరి అత్తగారు కీ॥శే॥ సత్యవతి వెంకటరత్నమ్మ గారు,
మామగారు నరసింహంగార్ల జ్ఞాపకార్థం
6. శ్రీ ఉండవిల్లి బాపిరాజు గారు (కాకినాడ) గోవులకు (2 ట్రాక్టర్ల వట్టి గడ్డి) 14000/-
7. శ్రీ గణేష చరణ ఆచార్య గారు (శాంతి ఆశ్రమం) 1100/-
వినాయక చవితి నిమిత్తం
8. శ్రీ గొల్లపూడి నాగేశ్వరరావు గారు (శాంతి ఆశ్రమం) 1000/-

9. శ్రీ ద్వారపూడి వెంకటరెడ్డి గారు (అనపర్తి) 2000/-
10. శ్రీ పి.వి. రెడ్డినాయుడు గారు (నాశిక్) 5000/-
11. శ్రీ గణేష్ చరణ ఆచార్యగారు (శాంతి ఆశ్రమం) 2620/-
గోగ్రాసం నిమిత్తం
12. శ్రీ శిద్ధానందగిరి స్వామిగారు (శాంతి ఆశ్రమం) 7001/-
గోసంరక్షణ నిమిత్తం
13. శ్రీమతి జి.బి.ఎస్. లక్ష్మిగారు (విశాఖపట్నం) 6000/-
వారి పుట్టినరోజు సందర్భముగా అన్నదానం
14. శ్రీమతి డా. వై. హేమగారు (విశాఖపట్నం) 8000/-
వీరి పుట్టినరోజు సందర్భముగా
15. శ్రీమతి సంకా విజయలక్ష్మి గారు (బెంగుళూరు) 5000/-
గిత్తలషెడ్ నిర్మాణము నిమిత్తం
16. శ్రీమతి డా. వై. హేమగారు (విశాఖపట్నం) గోగ్రాసం నిమిత్తం 2000/-
17. శ్రీ ఆర్. సుబ్రహ్మణ్యం గారు (హైదరాబాదు) 47500/-
18. శ్రీ పోసిన సత్తిబాబు గారు (శాంతి ఆశ్రమం) 3000/-
వీరి తల్లిగారు కీ॥శే॥ సత్యవతి గారి జ్ఞాపకార్థం
19. శ్రీమతి కె. లక్ష్మి గారు (హైదరాబాదు) 7,500/-
గో సంరక్షణ నిమిత్తం
20. శ్రీమతి తోట కస్తూరి భాయి గారు (పాయకరావు పేట) 5000/-
21. శ్రీమతి కొర్లేపర శాంతి గారు (కాకినాడ) 5000/-
22. శ్రీ పురుషోత్తమ శర్మజీ గారు (పూనె) 25,000/-
వీరి తండ్రిగారు కీ॥శే॥ గోపిలాల్ డి. శర్మాజి గారి
ఆత్మశాంతి కోరుతూ... విద్యార్థుల సంక్షేమం నిమిత్తం
23. శ్రీ తణుకు రామకృష్ణ గారు 20,000/-
24. శ్రీ జి.ఎమ్.వి. రమణ గారు (న్యూఢిల్లీ) 3000/-
25. శ్రీ మలిశెట్టి సత్యనారాయణ గారు (పిఠాపురం) 5000/-
వీరి ధర్మపత్ని కీ॥శే॥ ఎమ్. పద్మజ గారి జ్ఞాపకార్థం
26. శ్రీమతి వెంకట భారత లక్ష్మి గారు (కాకినాడ) 25,000/-
27. శ్రీమతి శాంతి రావు ఎన్. గారు (చెన్నై) 2,50,000/-
కాకినాడ బ్రాంచిలో బిల్డింగ్ నిమిత్తం
28. శ్రీమతి నున్న శీతామహాలక్ష్మి గారు (చెన్నై) 2,50,000/-
కాకినాడ బ్రాంచిలో బిల్డింగ్ నిమిత్తం
29. శ్రీ కందుకూరి సీతారామయ్య గారు (రాజమండ్రి) 5000/-
వీరి కుమారుడు లేటు శ్రీ సూర్య ప్రదీప్ తేజ
కందుకూరి గారి ఆత్మ శాంతి కోరుతూ...

This Periodical is Registered with Registrar of Newspapers, New Delhi Vide R.No. 3447/57, Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

1. Auto Biography of Swami Omkar (2 Volumes) .......... Rs. 150/-
2. Life and Teachings of Swami Omkar .......................... Rs. 10/-
3. Soham .......................................................................... Rs. 10/-
4. Cosmic Fast ..................................................................Rs. 20/-
5. Meditation.....................................................................Rs.10/-
6. Om Japa .......................................................................Rs.10/-
7. Control of Mind ............................................................Rs.30/-
8. Cosmic Flashes ............................................................Rs.10/-
9. In the Hours of Silence ............................................... Rs.10/-
10. The Soul of Omkar ......................................................Rs.10/-
11. How I learned English .................................................Rs.10/-
12. Reincarnation of my Little Sister .................................Rs.10/-
13. God Realization Now and Here ....................................Rs.10/-
14. Mystic Prayers and Poems ..........................................Rs.20/-
15. The Divine Voice of Omkar ..........................................Rs.40/-
16. Auto Biography of Omkar (Revised Edition) ..............Rs.100/-
17. Petals of Peace ...........................................................Rs.20/-
18. The Story of my life and Work ......................................Rs.10/-
19. Priceless legacy of Swami Omkar ................................Rs.10/-
20. The Four Initiations ......................................................Rs.10/-
21. Musings ........................................................................Rs.20/-
22. Peace Prayer ................................................................Rs.20/-

THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు : శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446.
తూ॥గో॥జిల్లా., (ఆ.ప్ర.)
ఫోన్ : 7382009962
email:srisanthiashram@gmail.com
www :www.srisantiashram.org

Printed Book

To

______________________

______________________

______________________

______________________

Printed by Padmanabha Offset Printers and Published by Swamini Vinamrananda on behalf of The Mission of Peace Sri Santi Ashram and Printed at Padmanabha Off-set Printers, Kakinada - 533 004 Cell : 93979 50719 and Published at Thotapalli Hills 533 446 Ph : 7382009962 Editor : Swamini Vinamrananda.